సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 10-7-2026 ₹ 15/-





# పశ్చిమాసియా రగులుతున్న కుంపటి




## మత్తు కోరల్లో చిక్కుకున్న యువతరం



గీటురాయి
వారపత్రిక

# GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

**Our Bank A/c Details:**
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 48 సంచిక: 28 హైదరాబాద్
శుక్రవారం 10 జూలై 2026 రూ.15-00
ముహర్రమ్ 24 1448 హిజ్రీ


**తొలిగీటు**

సూదీ దారం కూడా తిరిగి ఇచ్చివెయ్యండి. నమ్మకద్రోహానికి పాల్పడకండి. ఎందుకంటే ఇది ప్రళయదినాన అవమానానికి కారణభూతమవుతుంది. సిగ్గుపడేలా చేస్తుంది.

*(నసాయి)*


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com





## లోపల...


| | | |
|---|---|---|
| పౌరసత్వం | ...... | 04 |
| పశ్చిమాసియా రగులుతున్న కుంపటి | ...... | 05 |
| భారత రాజకీయ ముఖచిత్రం:సమాఖ్య స్ఫూర్తి, ప్రజాస్వామ్య భవిష్యత్తు | ...... | 08 |
| అతి శుభ్రత వెనుక వున్న 'అదృశ్య' వేదన! | ...... | 11 |
| మత్తు కోరల్లో చిక్కుకున్న యువతరం... | ...... | 12 |
| అస్తమించిన ఉజ్వల తార | ...... | 14 |
| సామర్థ్యాలను బట్టి బాధ్యతలను అప్పజెప్పాలి | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) | ...... | 19 |
| కూల్చివేతల కాలం! | ...... | 20 |
| చరిత్ర అధ్యయనం మన బాధ్యత | ...... | 27 |
| ఉషా కిరణాల వేళ... 'బరకత్' రహస్యం | ...... | 28 |
| అల్గారిథమ్ వల | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| క్షమాగుణం | ...... | 34 |


**'గో' అస్త్రం..**




(360 కోట్లతో అధునాతన గోశాలలు, మోడీతో ప్రారంభోత్సవం)

గోశాలలు కడతడంట
ముఖ్యమంత్రి రేవంతు
భాజపాకు సహకారం
ఇస్తడంట తనవంతు!

అంగరంగ వైభవంగ
ఉంటదంట ఆరంభం
మోడీ తాతనే పిలిచి
చేస్తడంట ప్రారంభం!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## పౌరసత్వం

**ప్రముఖ న్యాయనిపుణుడు** ఫైజాన్ ముస్తఫా ఇటీవల పౌరసత్వం గురించి లీగల్ అవేర్‌నెస్ వెబ్ సిరీస్‌లో చెప్పిన మాటలు ఎంతైనా ఆలోచించ దగినవి. ఆయన ఈ మాటలు ఎందుకు చెప్పారంటే ఇప్పుడు మరోసారి పౌరసత్వం అనేది చర్చనీయాంశంగా మారింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు పాస్‌పోర్ట్ అనేది కేవలం ఒక ప్రయాణ పత్రం మాత్రమేనని, పౌరసత్వానికి రుజువు కాదని ఒక ప్రకటన చేసిన తర్వాత ఈ చర్చ మొదలయ్యింది. గమనించవలసిన విషయమేమిటంటే, కొద్ది రోజుల క్రితం సుప్రీంకోర్టు బీహార్‌లో ఎస్ఐఆర్ సందర్భంగా ఒక తీర్పులో పాస్‌పోర్ట్ పౌరసత్వానికి రుజువు అని చెప్పింది. నిజానికి భారత దేశంలో ప్రభుత్వం ఎలాంటి పౌరసత్వ ధృవీకరణ పత్రాన్ని జారీ చేయదు.

పాస్‌పోర్టులో భారత పౌరుడు అని ప్రభుత్వం స్టాంప్ వేసి ఇస్తుందన్నది వేరే విషయం. నిజానికి పౌరసత్వం నిరూపించుకోవడం అనేది చాలా కష్టమైన పనే. స్వాతంత్ర్యం లభించిన ప్రారంభ సంవత్సరాల్లో పౌరసత్వం అనేది అందరినీ కలుపుకుపోయే భావనగా ఉండేది. కానీ ఇప్పుడు పౌరసత్వం అనేది మినహాయింపు భావనగా మారిపోయినట్లు కనిపిస్తోంది.

అస్సాంలో ఫారినర్స్ ట్రిబ్యునల్స్‌లో చాలా మందిని భారత పౌరులుగా అంగీకరించలేదు. వారి వద్ద ఎన్ని డాక్యుమెంట్లు ఉన్నా ఉపయోగపడలేదు. ఈ వివరాలు చెబుతూ ఫైజాన్ ముస్తఫా పాతకాలంలో కేసులను వివరించారు. ఈ సందర్భంగా ఆయన 1951నాటి షబ్బీర్ హుస్సేన్ కేసు ఉదాహరించారు. ఈ షబ్బీర్ హుస్సేన్ ఒక వ్యాపారి. వ్యాపారం కోసం లాహోర్ వెళ్ళారు. దేశ విభజన జరిగింది, రక్తపాతం జరిగింది, ఆయన అక్కడే చిక్కుకుపోయారు. దేశం విడిపోయిన తర్వాత అటు నుంచి ఇటు రావడానికి ఎలాంటి దారి లేదు.

అక్కడభారతీయ రాయబార కార్యాలయం పాకిస్తానీలకు లేదా విదేశీయులకు జారీ చేస్తున్న ఒక తాత్కాలిక పర్మిట్ తీసుకుని ఇండియా వచ్చేశాడు. ఆ తర్వాత ఇక్కడే ఉండిపోయాడు. ఎందుకంటే ఇదే కదా ఆయన స్వస్థలం. ఈ విషయం పోలీసులకు తెలిసింది. అరెస్టు చేశారు. కేసు సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. కోర్టు తీర్పులో అప్పటి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, పాకిస్తాన్‌లో చిక్కుకుపోయాడని నిర్ధారించి భారతపౌరుడిగా నిర్ణయించిందని ఫైజాన్ ముస్తఫా ఆ కేసు వివరాలు చెప్పారు. పౌరసత్వం విషయంలో ఒక ఇంక్లూసివ్ భావనతో అప్పట్లో వ్యవహరించేవారు. కాని తర్వాత తర్వాత పౌరసత్వం విషయంలో ఎక్స్‌క్లూషన్ భావన పెరిగింది. ఫైజాన్ ముస్తఫా రజియా బేగం కేసును ఉదహరించారు. ఈ కేసులో భారత పాస్ పోర్టు పౌరసత్వానికి రుజువు కాదని కోర్టు చెప్పిందన్నారు. అంటే విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చెప్పిన మాట సరైనదే. పాస్ పోర్టు పౌరసత్వానికి రుజువుగా చట్టం పరిగణించడం లేదు. భారత పౌరుడైన వ్యక్తికి మాత్రమే పాస్‌పోర్ట్ ఇస్తారన్న మాట నిజమే అయినా, పాస్ పోర్టు మాత్రం ప్రయాణ పత్రంగానే పరిగణిస్తున్నారు. అలాగే భారత పౌరుడికి మాత్రమే ఓటర్ ఐడీ కార్డ్ ఇస్తారు. కాని ఈ రెండు కూడా పౌరసత్వాన్ని నిర్ధారించవు. డాక్టర్ అంబేద్కర్ ప్రకారం పౌరసత్వానికి సంబంధించిన నిబంధనలు రూపొందించడం రాజ్యాంగ సభకు, డ్రాఫ్టింగ్ కమిటీకి చాలా కష్టమయ్యింది. భారతదేశంలో జన్మించినంత మాత్రాన పౌరసత్వం ఇవ్వరాదని చాలా మంది పట్టుబట్టారు. ఏది ఏమైనా ఆర్టికల్ 5 భారతదేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ భారతదేశ పౌరుడే అని చెప్పింది. జనవరి 26, 1950 నాటికి ఎవరు భారతదేశ పౌరులనేది మాత్రమే రాజ్యాంగం చెప్పింది. భవిష్యత్తులో పౌరసత్వ చట్టాన్ని రూపొందించే అధికారాన్ని ఆర్టికల్ 11 పార్లమెంట్‌కు ఇచ్చింది.

కానీ 1986 నాటికి ఇంక్లూసివ్ దృక్పథం పలుచబడింది. అస్సాంలో బంగ్లాదేశీ చొరబాటుదారులనే ఆందోళన పెరిగింది.

ఆ తర్వాత చట్టప్రకారం కేవలం భారతదేశంలో జన్మించినంత మాత్రాన భారత పౌరులు కాదు. తల్లిదండ్రులలో ఒకరు కూడా భారతదేశ పౌరులై ఉండాలి. 2003 నాటికి ఈ నిబంధన మరింత కఠినమైంది. కేవలం భారతదేశంలో పుడితే సరిపోదు, తల్లిదండ్రులిద్దరూ కూడా భారతదేశ పౌరులై ఉండాలన్నారు. ఒకవేళ ఇద్దరూ భారత పౌరులు కాకపోతే, కనీసం ఒకరు భారత పౌరుడై ఉండి, మరొకరు చట్టవిరుద్ధమైన చొరబాటు దారులు కాకూడదు.

ప్రభుత్వం 2019లో పౌరసత్వ చట్టానికి సవరణ చేసింది, కానీ దాని నిబంధనలను 5 సంవత్సరాల పాటు నోటిఫై చేయలేదు. 2024 ఎన్నికలకు ముందు వాటిని నోటిఫై చేసింది. 2025లో ఎస్.ఐ.ఆర్ మొదలైంది. మొదట బీహార్‌లో ఆ తర్వాత మిగతా రాష్ట్రాల్లో. మరోసారి ఇప్పుడు పౌరసత్వం అనేది చర్చనీయాంశంగా మారింది. అస్సాంలో ఎన్.ఆర్.సి జరిగింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరిగింది. ఎన్.ఆర్.సి జాబితాలో పేరు లేని 19 లక్షల మందిని పక్కన పెట్టినా, పౌరసత్వం నిరూపించుకోబడి, జాబితాలో ఉన్న 3 కోట్ల 11 లక్షల మందిలో ఒక్కరికి కూడా పౌరసత్వ ధృవీకరణ పత్రం దక్కలేదు.

విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పాస్ పోర్టు గురించి చేసిన ప్రకటన తర్వాత నిజంగానే ప్రజలకు పౌరసత్వం నిరూపించుకునే పరిస్థితి వస్తే ఏమవుతుందనేది ప్రశ్న. అప్పుడు నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ తయారవుతుంది. ఆ తర్వాతే పౌరసత్వ ధృవీకరణ పత్రం ఇస్తారు. దీనికి లక్షల కోట్లు ఖర్చవుతాయి. జనమంతా క్యూలో నిలబడి పత్రాల కోసం ప్రయాస పడాలి. 1987 కన్నా ముందు జన్మించిన వారికి ఈ రుజువులు కాస్త తేలికే. కాని ఆ తర్వాత జన్మించిన వారు, 2003 తర్వాత జన్మించిన వారు తల్లిదండ్రుల పౌరసత్వాన్ని నిరూపించాల్సి ఉంటుంది. కూలినాలి జనం, నిరుపేదల వద్ద బర్త్ సర్టిఫికేట్లు ఉంటాయా? తల్లిదండ్రుల బర్త్ సర్టిఫికేట్లు ఉంటాయా? తల్లిదండ్రులు భారతదేశ పౌరులని వారెలా నిరూపించుకుంటారు?

ఇప్పుడు ఎస్ఐఆర్ లో పేరు తొలగించబడిన వారి పాస్ పోర్టు రెన్యూవల్ చేయడం లేదన్న వార్త వచ్చింది. అనేక రాష్ట్రాలలో సంక్షేమ పథకాలను నిరాకరించే పరిస్థితి రావచ్చు. ఎస్.ఐ.ఆర్ జాబితాలో పేరు లేని వారి విషయంలో హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందనేది వేచి చూడాలి.

పాస్‌పోర్ట్ అయినా, ఆధార్ అయినా, ఓటర్ ఐడీ అయినా పౌరసత్వానికి కంక్లూజివ్ ప్రూఫ్‌గా పరిగణించబడటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో భారత పౌరసత్వాన్ని నిరూపించే ఖచ్చితమైన పత్రం గురించి స్పష్టమైన అవగాహన ప్రభుత్వమే ప్రజలకు ఇవ్వాలి.

అబ్దుల్ వాహెద్




# పశ్చిమాసియా రగులుతున్న కుంపటి

**ఈరాన్‌లో** సుప్రీం లీడర్ అలీ ఖొమెనాయి అంత్యక్రియలు 3వ తేదీ నుండి 9వ తేదీ వరకు జరుగుతాయి. ప్రపంచం నలుమూలల నుండి వివిధ దేశాల నేతలు అక్కడికి వెళుతున్నారు. ఇండియా ప్రధాని వెళ్ళడం లేదు కాని బీహార్ గవర్నర్ రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అతా హస్నైన్, భారత విదేశాంగ శాఖ సహాయ మంత్రి వెళుతున్నారు. ఫిబ్రవరి 28న అమెరికా ఒకవైపు చర్చలు జరుపుతూ మరోవైపు మోసపూరితంగా ఈరాన్ పై దాడి చేసి తన ఇంట ఉన్న అలీ ఖొమెనాయిని హతమార్చింది. ఆ తర్వాత ప్రారంభమైన ఈరాన్ అమెరికా యుద్ధంలో అనేక పరిణామాలు మనం చూశాం. పశ్చిమాసియాలో యూఏఈ, సౌదీ, ఖతార్, బహ్రెయిన్, కువైట్ తదితర దేశాల విధానాలేమిటో కూడా ప్రపంచం ముందుకు వచ్చాయి. యుద్ధం ఇప్పుడు శాంతించింది. అమెరికా, ఈరాన్ దేశాల మధ్య ఒక అంగీకారం కుదిరింది. కాల్పుల విరమణ అమలులో ఉంది. అయినప్పటికీ కొన్ని సంఘటనలు జరిగాయి. కాల్పుల విరమణ ఎంత బలహీనమైనదో, అమెరికా ఇస్రాయీల్ దేశాలు శాంతి స్థాపనకు ఎలా తూట్లు పొడుస్తాయో ప్రపంచం చూసింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో వార్త వచ్చింది. ఈ వార్త అమెరికా నిజరూపాన్ని ప్రపంచానికి చాటి చెబుతోంది. ఈ కాల్పుల విరమణ అంతా ఒక బూటకమని చెప్పే ఈ ప్రకటన చేసినవాడు స్వయంగా అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్. ఆయనేమన్నారంటే ఇరాన్‌తో చేసుకున్న 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం నిజానికి ఒక ఎత్తుగడ మాత్రమేనట. యుద్ధంలో ఒక విరామం అమెరికాకు అవసరం కాబట్టి ఈరాన్‌తో ఈ అంగీకారం చేసుకున్నారట. ఈ విరామ సమయంలో అమెరికా ప్రపంచ చమురు మార్కెట్‌లో పరిస్థితిని చక్కదిద్ది, పెరిగిన ధరలు తగ్గిన తర్వాత మళ్ళీ పూర్తి సైనిక ఏర్పాట్లు చేసుకుని ఈరాన్ పై దాడికి దిగుతారు. అమెరికా ప్రపంచంలో కోరుకునేది యుద్ధాలు మాత్రమే. ఇప్పుడు ఈ అంగీకారం ఎందుకు చేసుకున్నారంటే స్వయంగా అమెరికాలో చమురు ధరలు ఆకాశాన్నంటాయి. అమెరికాలో చమురు నిల్వలు అడుగంటాయి. అందువల్ల దిగివచ్చి ఈ ఒప్పందం చేసుకున్నారు. ఒకసారి ఈ పరిస్థితి నుంచి గట్టెక్కిన తర్వాత, చమురు నిల్వలు పెంచుకున్న తర్వాత, ఈరాన్‌పై మళ్ళీ విరుచుకుపడే ఆలోచన చేస్తారు.

ఈ యుద్ధంలో అమెరికా ఫైటర్ విమానాలు ధ్వంసమయ్యాయి. పశ్చిమాసియాలో స్థావరాలు నాశనమయ్యాయి. రాడార్లు కుప్పకూలాయి. అమెరికా సైన్యం గర్వించే యుద్ధనౌకల అసలు బలమేమిటో ప్రపంచం చూసింది. ఇప్పుడు మళ్ళీ యుద్ధసన్నాహాల కోసం ఒక సంధి ఒప్పందం చేసుకున్నారు. ఇస్రాయీల్‌కు కావలసింది కూడా ఇదే. లెబనాన్‌లో దాడులు చేస్తూ ఈ ఒప్పందాన్ని తూట్లు పొడిచే ప్రయత్నాలు ముందే ప్రారంభించింది. నెతన్యాహును డోనాల్డ్ ట్రంప్ తిట్టాడు. అమెరికా, ఇస్రాయీల్ మధ్య దూరం పెరుగుతోంది వగైరా వార్తల్లో నిజంలేదు. నెతన్యాహు చెప్పిందే ట్రంప్ చేస్తాడు. అంతకు మించి ట్రంప్ వద్ద గత్యంతరం కూడా లేదు.

మరోవైపు ఈరాన్ సిద్ధంగా ఉన్నామని చెబుతోంది. అమెరికాను నమ్మేది లేదని ఎప్పుడో చెప్పింది. హార్మూజ్ జలసంధిపై తమ పట్టును మరింత బలంగా బిగిస్తోంది. ఇప్పుడు మరో వార్త కూడా అంతర్జాతీయ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈరాన్ కొత్త సుప్రీంలీడర్ ముజ్తబా ఖొమెనాయిని హత్య చేయడానికి ఇస్రాయీల్ పథకాలు రచిస్తుందనేది ఆ వార్త సారాంశం. ఇస్రాయీల్ చరిత్రను పరిశీలిస్తే ఇతర దేశాల నేతలను హతమార్చడమే ఎక్కువగా కనిపిస్తుంది.

ఇలాంటి దేశాన్ని ఏమని పిలవాలి. ఒకవేళ ముజ్తబా ఖొమెనాయీపై దాడి జరిగితే ఈరాన్ ఎలా ప్రతిస్పందిస్తుందో ఈరాన్ విదేశాంగ మంత్రి ఎలాంటి శషభిషలు లేకుండా స్పష్టం చేశాడు. విచిత్రమేమి టంటే, పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్ అసీమ్ మునీర్ తో సహా పాకిస్తాన్ ప్రతినిధి బృందాన్ని కూడా హతమార్చే ఆలోచన ఇస్రాయీల్ చేసిం దనే వార్తలు వచ్చాయి. ఇప్పుడు తండ్రి అంత్యక్రియల సందర్భంగా ముజ్తబా ఖొమెనాయీ బహిరంగంగా ముందుకు వస్తారు. ప్రపంచంలోని వివిధ దేశాల నేతలు అక్కడ ఉంటారు. అలాం టప్పుడు ఆయనపై ఇస్రాయీల్ దాడి చేస్తుందా?

ఇదంతా ఒక పథకం ప్రకారమే జరుగుతోంది. మొదట గాజాలో మారణహోమం సృష్టించారు. వేలాది మంది పిల్లలను ఊచకోత కోశారు. సిరియాలో కీలుబొమ్మ జులానీని కూర్చోబెట్టారు. ఆ తర్వాత ఇరాన్‌పై అమెరికా ఇస్రాయీల్ కలిసి దాడి చేశాయి. ఈరాన్ ఇచ్చిన జవాబుతో ఇస్రాయీల్ ఐరన్ డోమ్ పేకమేడలా కుప్పకూలింది. హిజ్బుల్లాను అంతం చేసే సాకుతో లెబనాన్ దురాక్రమణకు పాల్పడు తున్నారు. ఇదంతా పశ్చిమాసియాను నియంత్రించడానికి జరుగు తున్న కుట్ర. ఎందుకంటే, పశ్చిమాసియాను నియంత్రించకపోతే అమెరికా పెట్రో డాలర్ నాశనమైపోతుంది. పెట్రోడాలర్ లేకపోతే అమెరికా ఆర్థికవ్యవస్థ ధ్వంసమైపోతుంది. అమెరికా ఆర్థికవ్యవస్థ ధ్వంసమైన మరుసటి రోజు ఇస్రాయీల్ ఉనికి ప్రశ్నార్థకమైపోతుంది. ఇది కేవలం అమెరికా, ఈరాన్‌ల మధ్య యుద్ధం కాదు. ఈరాన్ అణుకార్యక్రమం మాత్రమే ఈ యుద్ధానికి కారణం కాదు. అసలు కారణాలు పెట్రో డాలర్ తో ముడిపడి ఉన్నాయి.

ఈ ఒప్పందం ఈరాన్ పైచేయి సాధించిందని స్పష్టంగా చెబుతుంది. అమెరికా ఫ్రీజ్ చేసిన ఇరాన్ నిధులు విడుదల చేయాలని, ఆంక్షలను అంతం చేయాలని, ఇరాన్ చమురు ఎగుమతులను అనుమతించా లని, ఇరాన్ ఓడరేవులపై ఉన్న దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని, ఈరాన్ కోసం పునర్నిర్మాణ నిధిని ఇవ్వాలని ఈ ఒప్పందం చెబుతోంది. ఈరాన్ ప్రతిగా హోర్ముజ్ జలసంధిలో ఓడల రాకపోకలను అనుమతిస్తుంది. యుద్ధానికి ముందు హోర్ముజ్ జలసంధిలో ఈరాన్ అనుమతులు ఎవరు కోరేవారు కాదు. కాని ఇప్పుడు ఈరాన్ అనుమతి లేనిదే ఓడలు వెళ్ళలేవు. ఈరాన్ పైచేయి సాధించిందన డానికి ఈ ఒప్పందమే సాక్షి. కాని కాస్త నిశితంగా గమనిస్తే ఈ ఒప్పందం నిజానికి ఏ సమస్యను పరిష్కరించలేదు. కేవలం ప్రస్తుతానికి సమస్యలను దాటవేసింది. ఇది శాంతి కాదు. కేవలం ఒక భ్రమ మాత్రమే. ఇరాన్‌పై ఆంక్షల సడలింపు, చమురు ఎగుమతులు దేనికీ శాశ్వత గ్యారెంటీ ఈ ఒప్పందంలో లేదు. ఇది కేవలం 60 రోజుల గడువు వరకు మాత్రమే. అంటే నిజానికి ఈరాన్ సాధించింది కూడా పెద్దగా ఏదీ లేదు. బహుశా అన్ ఫ్రీజ్ చేసిన నిధులు లభిస్తాయి. లభించిన గడువులో ఈరాన్ తన చమురు ఎగుమతుల ద్వారా అవసరమైన ఆదాయాన్ని పొందుతుంది. అమెరికాను నమ్మేది లేదు కాబట్టి యుద్ధసన్నాహాలు కొనసాగిస్తుంది. అంటే అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన ప్రకటన ఒక ఒప్పుకోలు మాత్రమే. అమెరికా ఆలోచనల గురించి ఈరాన్‌కు ముందస్తు అవగాహన ఉంది. అందువల్లే ఈరాన్ తాము ఎంత చమురు ఎగుమతి చేశామో గర్వంగా ఇటీవల ప్రకటించింది.

ఈ యుద్ధాల ద్వారా ఇస్రాయీల్ ఏం సాధించాలనుకుంటోంది అనేది అసలైన ప్రశ్నం. ఈరాన్ వద్ద అణుబాంబు ఉండకూడదు, ఈరాన్ వద్ద క్షిపణులు ఉండరాదు. ఈరాన్ మద్దతిస్తున్న హూతీ, హిజ్బుల్లా, హమాస్ లు నాశనమైపోవాలి. అమెరికా ఈరాన్ మధ్య కుదిరిన ఒప్పందంలో ఈ విషయాలేవీ లేవు. కాబట్టి ఇస్రాయీల్ సాధించింది ఏదీ లేదు. ఈ యుద్ధంలో అమెరికా లక్ష్యాలేమిటనేది మరింత అయోమయంగా కనిపిస్తుంది. చమురు ధరలు యుద్ధం వల్ల పెరిగాయి. కాబట్టి ప్రస్తుతం అమెరికా చమురు ధరలు తగ్గాలనే ఒకే ఒక్క లక్ష్యాన్ని పెట్టుకుంది. ఒప్పందం తర్వాత అది జరిగింది అంటే ఈ ఒప్పందం కొంతవరకు అమెరికా లక్ష్యాన్ని సాధించింది. ఇది తాత్కాలికం మాత్రమే. ఒకసారి పరిస్థితి కుదుటపడిన తర్వాత మళ్ళీ ఈరాన్ పై ఒత్తిళ్ళు పెంచి అక్కడ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని కూర్చోబెట్టే ప్రయత్నాలు చేస్తారు.

అమెరికా ఈరాన్ మధ్య కుదిరిన ప్రస్తుత ఒప్పందంలో అంశాలు అమలవుతున్నాయా అనేది కూడా ఆలోచించాలి. ఫ్రీజ్ చేయబడిన ఈరాన్ నిధుల విడుదలకు సంబంధించి అనిశ్చితి ఉంది. హోర్ముజ్ జలసంధిలో తమ అనుమతి లేనిదే నౌకలు వెళ్ళడానికి వీల్లేదని ఈరాన్ ఖరాఖండిగా చెబుతోంది. న్యూక్లియర్ సమస్యపై చర్చే ఇంకా ప్రారంభం కాలేదు. అంటే సమస్యలేవీ పరిష్కారం కాలేదు. ఒక్కటే పరిష్కారం ఇందులో కనిపిస్తోంది. అది అమెరికాకు చమురు ధరలు తగ్గడం కావాలి, ఈరాన్ కు తన చమురు ఎగుమతులకు అవకాశం కావాలి. ఈ రెండు జరిగాయి. ఇస్రాయీల్‌కు ఏమీ దక్కలేదు. అందుకే ఈ ఒప్పందాన్ని తుంగల్లో తొక్కడానికి లెబనాన్‌పై దాడులకు దిగింది.

కాబట్టి ఈ ఒప్పందంపై పెద్దగా ఆశలు పెట్టుకోవలసిన అవసరం లేదు. 1919లో మొదటి ప్రపంచ యుద్ధం ముగిసినప్పుడు 'వెర్సైల్స్ ఒప్పందం' పై సంతకాలు జరిగన తర్వాత ప్రపంచం సంబరాలు చేసుకుంది. కాని ఫెర్డినాండ్ ఫోచ్ అనే ఫ్రెంచ్ సైనికాధికారి ఈ శాంతి కేవలం విరామం మాత్రమే అన్నాడు. మరో 20 సంవత్సరాల తర్వాత మళ్ళీ యుద్ధం తప్పదన్నాడు. అదే జరిగింది. రెండవ ప్రపంచ యుద్ధం 1939లో ప్రారంభమైంది. ఒప్పందాలు అంతర్గత సమస్యలను పరిష్కరించలేకపోతే శాంతి కేవలం విరామంగా మాత్రమే ఉంటుంది. 1953లో ముగిసిన కొరియా యుద్ధం కూడా ఇలాంటిదే. కాల్పుల విరమణ మాత్రమే కుదిరింది. సాంకేతికంగా ఇప్పటికి కూడా అంతర్గత సమస్యలు అలాగే ఉన్నాయి. యుద్ధం అధికారికంగా ముగియలేదు. ఇస్రాయీల్‌కు పొరుగు దేశాలకు మధ్య కూడా కాల్పుల విరమణ తర్వాత కాల్పుల విరమణలే తప్ప నిజానికి శాంతి లేదు. ఒక యుద్ధం దేనికోసం జరిగిందో ఆ అసలు సమస్యను పరిష్కరించకుండా వదిలేస్తే అది శాంతి కాదు.

అందుకే ఖతర్ రాజధాని దోహాలో జరిగింది పెద్ద ఆశ్చర్యమేమీ అనిపించదు.

స్టీవ్ విట్కాఫ్, జారెడ్ కుష్నర్‌లు చర్చలు జరపడానికి వచ్చారు. ఈరాన్ ప్రతినిధులు వారితో మాట్లాడడానికి నిరాకరించారు.

పాశ్చాత్య మీడియా ప్రకారం ఇరాన్ కుప్పకూలిపోయింది. మరోవైపు ఈరాన్ 40 మిలియన్ బారెల్స్ కంటే ఎక్కువ చమురును రవాణా చేశామని ప్రకటించారు. హోర్ముజ్ జలసంధి లో ప్రయాణించే ప్రతి నౌక రుసుము చెల్లించాలని ఈరాన్ కఠినంగా డిమాండ్ చేయడం మొదలు పెట్టింది. మరోవైపు లెబనాన్‌లో అమెరికా మధ్యవర్తిత్వంతో ఇస్రాయీల్‌కు లెబనాన్ ప్రభుత్వానికి మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం కూడా ఈరాన్ అమెరికా యుద్ధంతో సంబంధం ఉన్న ఒప్పందమే అన్నది మరిచిపోరాదు. హిజ్బుల్లా ఈ ఒప్పందాన్ని 'దేశద్రోహం'అని చెప్పింది. లెబనాన్‌లో జరుగు తున్నది, ఈరాన్ అమెరికాల మధ్య జరుగుతున్నది వేర్వేరు కావు. అన్నీ ఒకే తానులో ముక్కలు. రెండు వారాల లోపే 40 మిలియన్ బారెల్స్ చమురు ఈరాన్ అమ్ముకుందంటే అది చిన్న వార్త కాదు. హోర్మూజ్‌పై ఈరాన్ తన పట్టు మరింత బిగించింది. ఒమాన్ కూడా వ్యతిరేకించడం లేదు. ఇది అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన అని అమెరికా చెబుతోంది. అమెరికా ఎన్ని అంతర్జాతీయ చట్టాలు ఉల్లంఘించలేదు? ఎవరు ఏమీ చేయలేకపోయారు, ఎందుకంటే చట్టాల ఉల్లంఘనను అడ్డుకునే బలం ఎవరి వద్దా లేదు. ఇప్పుడు హోర్మూజ్ జలసంధిని ఈరాన్ పట్టునుంచి విడిపించే బలం అమెరికాకు కూడా లేదు. ఈరాన్ ఇప్పుడు ఎలాంటి స్థితిలో ఉందంటే, జలసంధిపై సమర్థవంతమైన నియంత్రణను కొనసాగిస్తే చాలు, ఆ తర్వాత వచ్చే రాబడితో మిగిలిన సమస్యలు వాటికవే సర్దుకుంటాయి. ఈరాన్ సాధించింది నిజానికి సైనిక విజయం కాదు. ఇది ఆర్థిక విజయం. ఈరాన్ పట్టు నుంచి జలసంధిని విడిపించడానికి అమెరికా చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైన తర్వాత లెబనాన్, ఇస్రాయీల్ మధ్య ఒప్పందాన్ని కుదిర్చే కొత్త ఎత్తుగడతో ముందుకు వచ్చింది. ఇలాంటి ఎత్తుగడలు చరిత్రలో అమెరికా తరఫున చాలా సార్లు కనిపిస్తాయి.

లెబనాన్, ఇస్రాయీల్ మధ్య ఒప్పందం అనధికారిక లక్ష్యం ఒక్కటే, లెబనాన్‌లో హిజ్బుల్లాను అంతం చేయడం. అమెరికా ఒక ఎత్తుగడగా ఈ ఒప్పందం కుదిర్చింది. అమెరికా గతంలో ఒకసారి ఈ ఎత్తుగడ అమలు చేసింది. 1978లో ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తెచ్చి మొత్తం సినాయ్ ద్వీపకల్పాన్నిఈజిప్టుకు ఇచ్చేలా ఒప్పించి, ఇస్రాయీల్ ఈజిప్టుల మధ్య శాంతి ఒప్పందం కుదిర్చింది. ఫలితంగా అరబ్ ఫ్రంట్ ముక్కలైంది, సోవియట్ యూనియన్ ఈ ప్రాంతం నుంచి తప్పుకోవలసి వచ్చింది. ఎందుకంటే ఈజిప్టు బలం లేకుండ అక్కడ నిలబడడం కష్టం కాబట్టి. ఇప్పుడు 2026లో లెబనాన్‌పై సరిగ్గా ఇలాంటి ఆటను ఆడటానికి అమెరికా ప్రయత్నిస్తోంది. మిలియన్ల డాలర్ల సహాయం, లెబనాన్ సాయుధ దళాలకు సహాయం, దక్షిణాది నుండి ఇస్రాయీల్ దళాల దశలవారీ ఉపసంహరణ లెబనాన్‌కు లభిస్తాయి. దీనికి ప్రతిగా లెబనాన్ హిజ్బుల్లాను అణిచేయాలని. అంటే, హిజ్బుల్లా లేకపోతే ఈరాన్ ఫ్రంట్ లైన్ ప్రాక్సీల్లో ఒకటి నాశనమైపోతుంది. కాని ఇక్కడ అమెరికా ప్రస్తుత నేతలు పరిగణన లోకి తీసుకోలేని ఒక వాస్తవం ఉంది. నేటి లెబనాన్ ప్రభుత్వం 1978 నాటి ఈజిప్టు ప్రభుత్వం మాదిరిగా బలమైనది కాదు. హిజ్బుల్లాను నియంత్రించే బలం లెబనాన్ సైన్యానికి లేదు. హిజ్బుల్లా లెబనాన్ పార్లమెంటులో కూడా ప్రాతినిధ్యం ఉన్న సంస్థ. అది బయటి శక్తి కాదు. హిజ్బుల్లా తిరస్కరించిన మరుక్షణం లెబనాన్, ఇస్రాయీల్ ఒప్పందం అర్థంలేనిదిగా మారింది. ఈ ఒప్పందం మరోవిధంగా లెబనాన్ ను అంతర్యుద్ధానికి గురిచేసినా ఆశ్చర్యం లేదు. అప్పుడు కూడా హిజ్బుల్లా బలహీనపడే పరిస్థితులు ఉండవు. పైగా మరింత బలపడవచ్చు.

ఈరాన్ ఇప్పుడు దోహాలో అమెరికాతో మాట్లాడేది ఏముంది. అసలు నిర్ణయాత్మక పరిణామాలు లెబనాన్‌లో ఉన్నాయి. వాటిని ఈరాన్ ముఖ్యంగా చూస్తోంది.

ఈ మొత్తం పరిస్థితిని పరిశీలిస్తే ఈరాన్ అమెరికాల మధ్య కుదిరిన ఒప్పందం భవిష్యత్తు మనకు స్పష్టంగా అర్థమవుతుంది. లెబనాన్‌లో చిచ్చు పెట్టడానికి ఇస్రాయీల్ ప్రయత్నిస్తూనే ఉంటుంది. లెబనాన్ ప్రభుత్వం ఇస్రాయీల్ తో సహకరిస్తూనే ఉంటుంది. ఆ సహకారానికి కావలసిన సహాయం అమెరికా ఇస్తూనే ఉంటుంది. ఇదంతా లెబనాన్‌లో అంతర్యుద్ధం వరకు దారితీయవచ్చు. ఈరాన్ అమెరికా ఒప్పందంలోని మొదటి అంశమే పూర్తి కావడం లేదు. లెబనాన్ విషయంలో ఈరాన్ తన ఒత్తిడిని పెంచుతూ పోతుంది. మరోవైపు హోర్మూజ్ జలసంధిపై ఈరాన్ తన అదుపును ఏమాత్రం తగ్గించడా నికి సిద్ధంగా లేదు. యుద్ధపూర్వస్థితి మరలా రావడం కష్టం. అమెరికా యుద్ధపూర్వస్థితి కోరుతోంది. హోర్మూజ్ మూయడం వల్ల ప్రపంచ మంతా చమురు సంక్షోభం అంచున నిలబడింది. అమెరికాలో కూడా కష్టాలు తప్పలేదు. కాబట్టి ఈ యుద్ధవిరామం ద్వారా ఆ కష్టాల నుంచి బయటపడ్డారు. ఇప్పుడు మరలా ఈరాన్‌పై సైనిక సన్నాహాలు చేసినా చేస్తారు.

కాని ఇప్పుడు పరిస్థితి యుద్ధం ముందు నాటి పరిస్థితి కాదు. అమెరికాను ఏ స్థాయిలో ఈరాన్ నిలువరించగలదో చైనా, రష్యాలు ప్రత్యక్షంగా చూశాయి. 30 ట్రిలియన్ డాలర్లకు పైగా అప్పుల్లో ఉన్న అమెరికా ఉనికికి పెట్రో డాలర్ వ్యవస్థ ఎంత అవసరమో ఈ రెండు దేశాలకు బాగా తెలుసు. చైనా తన కరెన్సీని అంతర్జా తీయంగా వాడుకలోకి తీసుకురావడానికి ఇది గొప్ప అవకాశం. ఒక్క బుల్లెట్ కాల్చకుండా అనేక యుద్ధలాభాలు చైనాకు లభిస్తు న్నాయి. అమెరికాను ఈరాన్ నిలువరిస్తుంటే, రష్యాకు ఉక్రెయిన్‌లో అవకాశాలు మెరుగవుతాయి. ఈ సమీకరణాలన్నీ స్పష్టంగా ఉన్నాయి. ఈ సారి అమెరికా దాడులు చేస్తే చైనా, రష్యాల సహకారం మరింత ఎక్కువగా ఈరాన్ కు లభిస్తుంది. అంతేకాదు, హోర్మూజ్ తో పాటు మరో ముఖ్యమైన కీలకమైన జలసంధి బాబుల్ మందేబ్ ను ఈరాన్ మిత్రపక్షం హూతీలు మూసేయవచ్చు. అదే జరిగితే బాబుల్ మందేబ్‌లో కూడా యుద్ధపూర్వస్థితి ఉండదు. నౌకలు రుసుము చెల్లించే పరిస్థితి రావచ్చు. ఇది ఈరాన్‌కు మరింత సానుకూలమైన పరిస్థితి అవుతుంది. ఈ లెక్కలన్నీ అమెరికా నేతల దృష్టిలో ఉన్నాయా లేక మరోసారి గట్టిగా ప్రయత్నిస్తే ఈరాన్‌ను ఓడించవచ్చు అనుకుంటున్నారా? కాలమే చెప్పాలి. ✤



# భారత రాజకీయ ముఖచిత్రం సమాఖ్య స్ఫూర్తి, ప్రజాస్వామ్య భవిష్యత్తు

**యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**

**ప్రస్తుత భారత రాజకీయ** యవనికపై ప్రతి ఒక్కరినీ వేధిస్తున్న అతిపెద్ద ప్రశ్న ఏమిటంటే, క్షేత్రస్థాయిలో ఆర్థిక ఇబ్బందులు, సామాజిక అశాంతి స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, అధికార పక్షం నిరంతర ఎన్నికల విజయాలను ఎలా సొంతం చేసుకోగలుగుతోంది? ఇది కేవలం నరేంద్ర మోడీ అనే ఒకే ఒక్క నాయకుడి చుట్టూ అల్లిన వ్యక్తిగత ఆరాధన, ప్రజాకర్షణేనా, లేక ప్రత్యామ్నాయాన్ని చూపలేని విపక్షాల బలహీనతా? లేక గత దశాబ్ద కాలంలో భారతీయ సమాజ అంతస్సూత్రాల్లో, సగటు ఓటరు మానసిక స్థితిలో విపక్షాలు ఊహించలేనంతటి మౌలిక మార్పులు సంభవించాయా? 2014 తర్వాత దేశ రాజకీయాల్లో వచ్చిన పరిణామాలు కేవలం ఒక ప్రభుత్వ మార్పిడికో, ముఖాల మార్పిడికో పరిమితం కాలేదు. అవి దేశ రాజకీయ చర్చల సరళిని, ప్రజాస్వామ్య విలువల ప్రాధాన్యతలను, ఓటర్ల ప్రాథమిక ఆలోచనా విధానాన్ని సమూలంగా మార్చేశాయి. ఒకప్పుడు ఎన్నికలు అంటే నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, విద్య, వైద్యం, రైతాంగ సంక్షేమం, మౌలిక వసతుల కల్పన వంటి ప్రజా సమస్యల చుట్టూ తిరిగేవి. తమ దైనందిన జీవితాల్లో పాలకులు తెచ్చిన గుణాత్మక మార్పుల ఆధారంగానే ప్రజలు ఓటు అనే ఆయుధాన్ని ప్రయోగించేవారు. కానీ నేడు, రాజకీయాలకు కేంద్ర బిందువు లాంటి ప్రజా సమస్యలను పక్కనబెట్టి, మత విద్వేషం, భావోద్వేగ నినాదాల చుట్టూ చర్చను కేంద్రీకరించడంలో అధికార పక్షం అద్భుతమైన విజయం సాధించింది. ఈ వ్యూహాత్మక మార్పును వారు కేవలం గమనించడమే కాదు, తమ రాజకీయ ఉనికికి ఒక తిరుగులేని బ్రహ్మాస్త్రంగా మలచుకున్నారు.

అధికార పక్షం సాధిస్తున్న విజయాల రహస్యం కేవలం పోలింగ్ బూత్‌లలో పడే ఓట్లలో లేదు, అంతకుమించి ప్రజా చైతన్య దిశనే మార్చేయడంలో ఉంది. దేశంలో నిరుద్యోగ రక్కసి కోరలు చాచినప్పుడు, ధరల పెరుగుదలతో సామాన్యుడి బతుకు భారమై

నప్పుడు, లేక ఆర్థిక మందగమనం దేశాన్ని అతలాకుతలం చేస్తున్నప్పుడల్లా మీడియా వేదికలపైకో, రాజకీయ క్షేత్రంలోకో ఏదో ఒక మతపరమైన చిచ్చు లేదా భావోద్వేగ అంశం హఠాత్తుగా తెరపైకి రావడం వెనుక ఒక పక్కా వ్యూహం దాగి ఉంది. రామమందిర ప్రతిష్ఠాపన నుండి కాశీ, మధుర వివాదాల వరకు, చరిత్ర పుటలను తారుమారు చేసి మొఘల్ కాలపు నిర్ణయాలకు నేటి తరంతో ముడిపెట్టడం దాకా అన్నీ ఈ ఎజెండాలో భాగమే. ప్రజలు ఆకలి గురించి, బతుకు దెరువు గురించి ప్రశ్నించకుండా, నిరంతరం సాంస్కృతిక రక్షణ అనే ఒక కృత్రిమ భయంలో బతికేలా చేయడంలో వారు సఫలమయ్యారు. బహుళత్వ సమాజంలో మెజారిటీ వర్గం అభద్రతా భావాన్ని, సుప్తచేతనావస్థలో ఉన్న మతాభిమానాన్ని రెచ్చగొట్టి, దాన్నొక వ్యవస్థీకృత రాజకీయ ఓటు బ్యాంకుగా మార్చడం ఈ వ్యూహంలో కీలక అంకం. గత పాలకుల కాలంలో మెజారిటీ వర్గం వివక్షకు గురైందనే ఒక అవాస్తవ కథనాన్ని నిరంతరం ప్రచారం చేయడం ద్వారా దాన్ని రాజకీయ పెట్టుబడిగా మార్చుకున్నారు. అదే సమయంలో, మైనారిటీల హక్కుల గురించి లేదా వారి రక్షణ గురించి ఎవరు మాట్లాడినా, దానిని 'ఓటు బ్యాంక్ రాజకీయం' గానో లేక 'సంతుష్టీకరణ' గానో ముద్ర వేయడంతో సమాజంలో 'వాళ్ళు', 'మనం' అనే విభజన రేఖలు ఏర్పడ్డాయి. ఎన్నికలు రాగానే లవ్ జిహాద్, జనాభా నియంత్రణ, పౌరసత్వ సవరణ చట్టాల (CAA - NRC) వంటి వివాదాలను ఉద్దేశపూర్వకంగా రగిల్చి, అంతర్గత కుల విభేదాలను, ప్రాంతీయ అస్తిత్వాలను తొక్కిపెట్టి, ఒకే ఒక్క హిందూ రాజకీయ గుర్తింపును బలోపేతం చేశారు.

ఈ మొత్తం నయా రాజకీయ నమూనాలో నరేంద్ర మోడీ వ్యక్తిగత ఇమేజ్ ఒక రక్షణ కవచం అయితే, దాని చుట్టూ నిర్మించిన జాతీయవాద కథనం అంతకంటే బలమైనది. ఆయన్ను కేవలం ఒక ప్రధానమంత్రిగా కాకుండా, శతాబ్దాల నాటి సాంస్కృతిక దాస్యాన్ని పోగొట్టే ఒక ఆధునిక 'రక్షకుడిగా', అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్ఠను పెంచిన ఏకైక 'నాయకుడిగా' ప్రదర్శించడంలో ఐటీ సెల్స్, సోషల్ మీడియా నెట్‌వర్క్‌లు రాత్రింబవళ్లు శ్రమించాయి. చర్చల నియంత్రణను (Narrative Control) తమ గుప్పిట్లోకి తీసుకోవడం ద్వారా ప్రజలు ఏం ఆలోచించాలి, ఏ అంశాలపై స్పందించాలనే విషయాన్ని పాలకులే నిర్దేశించే స్థాయికి దేశం చేరుకుంది. అందుకే, రైతుల సుదీర్ఘ పోరాటాలు, కార్పొరేట్ శక్తుల దోపిడీ, పడిపోతున్న రూపాయి విలువ వంటి వాస్తవాలు ప్రధాన స్రవంతి మీడియాలో అప్రధాన అంశాలుగా మారిపోయాయి. పైగా, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం అంటే శత్రుపక్షం కాదు, అదొక ప్రత్యామ్నాయం అనే ప్రాథమిక సూత్రాన్ని విస్మరించి, రాజకీయ విమర్శలను ఏకంగా దేశద్రోహంతో ముడిపెట్టే ప్రమాదకర సంస్కృతికి తెర లేపారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం దేశాన్ని అవమానించడమనే భావనను ప్రజా బాహుళ్యంలో బలంగా చొప్పించారు. దీనికి తోడు, విపక్షాల అసమర్థత కూడా వారికి వరంగా మారింది. కాంగ్రెస్‌తో సహా ఏ ప్రాంతీయ పార్టీ కూడా తాము అధికార పక్షానికి ఎందుకు ప్రత్యామ్నాయమో, తమకున్న స్పష్టమైన జాతీయ లేదా ఆర్థిక విజన్ ఏమిటో ప్రజల నమ్మకాన్ని చూరగొనేలా చెప్పడంలో ఘోరంగా విఫలమయ్యాయి.

ఈ పుష్కర కాల పరిపాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థల నిర్వీర్యం, రాజ్యాంగ విలువల పతనం అత్యంత ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయని విశ్లేషకులు ఘాటుగానే విమర్శిస్తున్నారు. ఒకవైపు 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అనే ఆకర్షణీయమైన నినాదాలు ఇస్తూనే, క్షేత్రస్థాయిలో భయాందోళనల వాతావరణాన్ని, అసమ్మతిపై ఉక్కుపాదాల్ని మోపారు. పెగాసస్ వంటి అధునాతన నిఘా సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించి పౌరుల, ప్రతిపక్ష నాయకుల, జర్నలిస్టుల వ్యక్తిగత స్వేచ్ఛను హరించడం, పాలకులకు సన్నిహితంగా ఉన్న కార్పొరేట్ వర్గాలకు ప్రయోజనం చేకూర్చే ఆర్థిక విధానాలతో కొద్దిమంది శతకోటీశ్వరులకే దేశ సంపదను కట్టబెట్టడం బహిరంగ రహస్యమే. ఇక ఎన్నికల బాండ్ల ఉదంతం ద్వారా రాజకీయ నిధుల సమీకరణలో సృష్టించిన అసమతుల్యత, ఎన్నికల పోటీ రంగంలో ఆర్థిక సమానత్వాన్ని పూర్తిగా దెబ్బతీసింది. ఈ అపరిమితమైన ఆర్థిక బలంతో, ఈడీ (ED), సీబీఐ (CBI), ఆదాయపన్ను వంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థలను విపక్షాలను బ్లాక్‌మెయిల్ చేయడానికి, లొంగదీసుకోవడానికి సాధనాలుగా వాడుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఒకవైపు ప్రతిపక్ష నేతలపై అవినీతి కేసులు మోపడం, అదే నేతలు అధికార పార్టీలో చేరగానే వారిపై కేసులు మాయమైపోవడం లేదా విచారణలు నత్తనడకన సాగడం ద్వారా 'అవినీతిపై పోరాటం' అనే నినాదం ఎంతటి బూటకమో స్పష్టమైంది. మణిపూర్ లాంటి సున్నితమైన సరిహద్దు రాష్ట్రంలో నెలల తరబడి జాతి నిర్మూలన హింస, మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నా, జాతీయ మీడియాలో గానీ, ప్రధాన రాజకీయ చర్చల్లో గానీ దానికి కనీస ప్రాధాన్యత దక్కకపోవడం పాలకుల క్రూరమైన నిశ్శబ్దానికి, మీడియా లొంగుబాటుకు నిదర్శనం.


ప్రస్తుత రాజకీయాల్లో అత్యంత ప్రమాదకరమైన అంశం ఏమిటంటే, భారతదేశ బహుళత్వానికి, వైవిధ్యానికి ప్రతీకలైన రాష్ట్రాల స్వయంప్రతిపత్తిపై, సమాఖ్య స్ఫూర్తిపై జరుగుతున్న నిరంతర దాడులు. ముఖ్యంగా ఉత్తరాది–దక్షిణాది రాష్ట్రాల మధ్య ఆర్థిక, సామాజిక వ్యత్యాసాలను కేంద్ర ప్రభుత్వ విధానాలు మరింతగా ప్రభావితం చేస్తున్నాయి. జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసి, అక్షరాస్యతలో, పారిశ్రామికాభివృద్ధిలో దూసుకుపోతున్న దక్షిణాది రాష్ట్రాల పన్నుల ఆదాయాన్ని కేంద్రం దోచుకుంటూ, జనాభాను పెంచుకుంటూ పోతున్న ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా నిధులు మళ్లించడం ద్వారా దక్షిణాదిపై తీవ్ర వివక్ష చూపుతోంది. రేపు జరగబోయే నియోజక వర్గాల పునర్విభజన (Delimitation) ద్వారా దక్షిణాది పార్లమెంటు స్థానాల సంఖ్య తగ్గిపోయి, రాజకీయంగా దక్షిణాది రాష్ట్రాలు తమ ఉనికిని, ప్రాధాన్యతను కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. దీనికి తోడు, ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ, ఎన్నికైన ప్రభుత్వాల నిర్ణయాలను అడ్డుకుంటూ సమాంతర పాలన సాగించడం సమాఖ్య స్ఫూర్తిని నిలువునా పూడ్చిపెట్టడమే. ప్రజాస్వామ్యానికి నాల్గవ స్తంభంగా నిలవాల్సిన మీడియా, పాలకుల భజన బృందంగా మారి ‘గోదీ మీడియా’గా రూపాంతరం చెందడం ఈ శతాబ్దపు అతిపెద్ద విషాదం. నిరుద్యోగి అయిన యువకుడు ఉపాధి గురించి, కష్టాల్లో ఉన్న రైతు మద్దతు ధరల గురించి ప్రశ్నించకుండా, వారి అసంతృప్తిని కూడా మతపరమైన ఉన్మాదంతో ముడిపెట్టి నిరంతరం గుర్తింపు రాజకీయాల మత్తులోనే మునిగిపోయేలా సోషల్ మీడియా నెట్‌వర్క్‌లను వాడుకుంటున్నారు.

అయితే, ఏ రాజకీయ అజేయత, ఆధిపత్యం కూడా చరిత్రలో శాశ్వతం కాదనేది జగద్విదిత సత్యం. ప్రజా బాహుళ్యాన్ని తాత్కాలికంగా భావోద్వేగాల మాయాజాలంతో, దేశభక్తి ముసుగులో కట్టిపడేసినప్పటికీ, చివరికి ఏ మనిషైనా తన దైనందిన జీవన మనుగడ సమస్యలైన కూడు, గూడు, గుడ్డ, ఉద్యోగం, పిల్లల చదువుల వైపు మరలక తప్పదు. కేవలం ఎన్నికలలో గెలవడమే ప్రజాస్వామ్యానికి ఏకైక కొలమానం కాదు; వ్యవస్థల స్వతంత్రత, పౌర హక్కుల రక్షణ, భిన్నత్వంలో ఏకత్వం మాత్రమే దేశానికి అసలు ఆత్మ. మత ఆధారిత విభజన రాజకీయాల వల్ల వచ్చే తాత్కాలిక ఎన్నికల లాభాల కంటే, సమాజంలో ఏర్పడే సామాజిక చీలికలు తరాల తరబడి దేశ ప్రగతిని వెనక్కి నెట్టేస్తాయి. భారతదేశం ప్రస్తుతం ఒక చారిత్రక సంధియుగంలో నిలబడింది. ఒకవైపు నిరంతర మత వివాదాలు, ద్వేషపూరిత ఉపన్యాసాలు, ఏకఛత్రాధిపత్యం వైపు నడిపించే బాట ఉంటే, మరోవైపు ఉపాధి, సమాఖ్య స్ఫూర్తి, సామాజిక సమరసత, నిజమైన ప్రజాస్వామ్య పునరుద్ధరణ వైపు నడిపించే దారి ఉంది. ప్రజాస్వామ్య అంతిమ శక్తి ఎప్పుడూ ప్రజా కోర్టులోనే ఉంటుంది. ఈ రోజు అజేయంగా, తిరుగులేని శక్తిగా కనిపిస్తున్న పాలకులు రేపు ప్రజల తీర్పు ముందు సాగిలపడక తప్పదు. నేడు బలహీనంగా, చెల్లాచెదురుగా ఉన్న శక్తులు రేపు ఒక నూతన రాజకీయ ప్రత్యామ్నాయంగా, ప్రజాస్వామ్య ఆశాకిరణంగా ఎదగవచ్చు. భారతదేశ భవిష్యత్తు చివరికి ప్రజల తీర్పుతోనే లిఖించబడుతుంది. అదే ఈ మట్టిలోని ప్రజాస్వామ్య ఆత్మ. ✤

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.




# అతి శుభ్రత వెనుక ఉన్న 'అదృశ్య' వేదన!

డాక్టర్ కుతుబ్ ఉద్దీన్
మానసిక వైద్య నిపుణులు, USA

**నేటి యాంత్రిక జీవనంలో** OCD అనే పదం సర్వసాధారణమైపోయింది. ఏదైనా వస్తువును వరుసలో పెడితేనో, అతిగా శుభ్రం చేసుకుంటేనో.. వెంటనే "నాకు OCD ఉంది" అని సులభంగా అనేస్తుంటాం. కానీ, అసలు OCD అంటే ఏమిటి? అది కేవలం ఒక అలవాటా, లేక చికిత్స అవసరమైన మానసిక వ్యాధా? ఈ సత్యాన్ని గ్రహించడం చాలా ముఖ్యం.

శుభ్రతకు, వ్యాధికి మధ్య ఉన్న గీత ఎక్కడ? అలవాటుకు, OCDకి మధ్య ఉన్న సన్నని గీతను గుర్తించడం చాలా కీలకం. ఒక వ్యక్తి తన రోజువారీ పనులలో భాగంగా శుభ్రతను పాటిస్తే అది మంచి అలవాటే. కానీ, ఆ శుభ్రత లేకపోతే తీవ్రమైన ఆందోళన చెందడం, మనసు నిలకడ లేకపోవడం, రోజులో గంటల తరబడి కేవలం శుభ్రతకే కేటాయించడం వంటివి OCD లక్షణాలు. ఇది వ్యక్తి యొక్క వృత్తిపరమైన, సామాజిక జీవితాన్ని పూర్తిగా స్తంభింపజేస్తుంది. రోగికి తాను చేసే పనులు అర్థరహితమని తెలిసినా, ఆ బలహీనత నుంచి బయటపడలేక నలిగిపోతాడు.

**OCD ఎలా ఉంటుంది? దీనిని నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు:**

1. **కాలుష్య భీతి:** క్రిములు లేదా మురికి సోకుతుందనే భయంతో పదేపదే చేతులు కడుక్కోవడం.
2. **క్రమబద్ధీకరణ:** వస్తువులు ఒక ఖచ్చితమైన క్రమంలో లేకపోతే తీవ్రమైన అశాంతికి గురికావడం.
3. **సందేహాలు - తనిఖీ:** తలుపులు వేసామా లేదా, స్టవ్ ఆపామా లేదా అని అనుమానంతో పదేపదే తనిఖీ చేయడం.
4. **అవాంఛిత ఆలోచనలు:** నైతిక, మతపరమైన విలువలకు విరుద్ధమైన హింసాత్మక లేదా అసభ్యకరమైన ఆలోచనలు మనసులో మెదలడం.

మనస్తత్వశాస్త్రం ఏం చెబుతోంది? మనోవైజ్ఞానిక పరిభాషలో వీటిని 'అబ్సెషన్స్' (మళ్ళీ మళ్ళీ వచ్చే ఆలోచనలు), 'కంపల్షన్స్' (ఆ ఆలోచనల వల్ల చేసే పనులు) అంటారు. ఇవి రోగి వ్యక్తిత్వానికి విరుద్ధంగా (Ego-dystonic) ఉంటాయి. అంటే, ఆ ఆలోచనలు తమవి కావని, ఏదో బయటి శక్తి తమను వేధిస్తోందని రోగి తీవ్ర ఆవేదన చెందుతాడు.

**ఇస్లామిక్ దృక్పథం-పరిష్కారం:** శుభ్రత అనేది ఇస్లాంలో సగభాగం. అయితే, ఈ శుభ్రత పేరుతో అతి చేయడం వ్యాధిగా మారుతుంది. ఇస్లామిక్ న్యాయశాస్త్రం (Fiqh) లో ఒక అద్భుతమైన సూత్రం ఉంది: "నిశ్చయం, సందేహం వల్ల తొలగిపోదు". అంటే, మీరు ఉజు (శుద్ధి) చేసుకున్నారనే నమ్మకం ఉన్నప్పుడు, కేవలం ఒక సందేహం కోసం మళ్ళీ మళ్ళీ ప్రక్షాళన చేసుకోవలసిన అవసరం లేదు. ఈ సూత్రం ఆధునిక మనస్తత్వశాస్త్రంలోని 'ఎక్స్‌పోజర్ అండ్ రెస్పాన్స్ ప్రివెన్షన్' (ERP) థెరపీకి దగ్గరగా ఉంటుంది. అంటే, సందేహాన్ని భరిస్తూ, ఆ కర్మను ఆపేయడం ద్వారా మనసును నియంత్రించుకోవడం.

**చివరి మాట:** OCD అంటే కేవలం వ్యక్తిత్వ లోపం కాదు, అది ఒక మెదడుకు సంబంధించిన సమస్య. దీనికి సరైన కౌన్సెలింగ్, కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ (CBT), అవసరమైతే నిపుణులైన సైకియాట్రిస్ట్ పర్యవేక్షణలో మందుల ద్వారా చికిత్స తీసుకోవడం ద్వారా రోగి మళ్ళీ సాధారణ జీవనశైలిని పొందవచ్చు. మీ మనసు చెప్పే ప్రతి సందేహానికి బానిస కాకండి, నిపుణులను సంప్రదించి ఆరోగ్యకరమైన జీవనానికి బాటలు వేసుకోండి. ✤




# మత్తు కోరల్లో చిక్కుకున్న యువతరం:
# సామాజిక వినాశనానికి దారితీస్తున్న మాదకద్రవ్యాల వ్యాప్తి

**ముహమ్మద్ హారూన్ అహ్మద్ ఖాన్**

**నేటి ఆధునిక సమాజాన్ని లోపలి నుండి తొలిచివేస్తున్న అత్యంత భయంకరమైన మహమ్మారి మాదకద్రవ్యాల వినియోగం. ప్రపంచంలోని అన్ని మతాలు, ముఖ్యంగా ఇస్లాం ధర్మం మానవ శరీరానికి, మనస్సుకు హాని కలిగించే ఏ చిన్న మత్తు పదార్థాన్నయినా ఖచ్చితంగా నిషేధించాయి. ప్రపంచ ఆరోగ్య నిపుణులు సైతం ఒక ఆరోగ్యకరమైన శరీరంలోనే ఆరోగ్యకరమైన మనస్సు నివసిస్తుందని, సమాజ పురోభివృద్ధికి ఆరోగ్యకరమైన స్త్రీ, పురుషులు ఎంతైనా అవసరమని నొక్కి చెబుతున్నారు.**

పూర్వీకులు 'ఆరోగ్యమే మహాభాగ్యం' అని ఊరకనే అనలేదు; సంపద లేకపోయినా పర్వాలేదు కానీ, శారీరక, మానసిక ఆరోగ్యం లేని నాడు మానవ జీవితం దుర్భరంగా మారుతుంది. అయితే, ప్రస్తుత కాలంలో విచ్చలవిడిగా లభిస్తున్న డ్రగ్స్, మద్యం, పొగాకు ఉత్పత్తులు ఈ సామాజిక ఆరోగ్య పునాదులను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి.

ప్రస్తుతం మన చుట్టూ ఉన్న నగరాలలో, ముఖ్యంగా హైదరాబాద్ వంటి చారిత్రాత్మక నగరాలలో మాదకద్రవ్యాల వ్యాప్తి వ్యవస్థీకృత ముఠాల ద్వారా విస్తరిస్తోందన్న సమాచారం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. డ్రగ్స్, మద్యం, జూదం, కల్తీ ఆహార పదార్థాల విక్రయాలు నగర యువతను, పాఠశాల, కళాశాల విద్యార్థులను లక్ష్యంగా చేసు కుని సాగుతున్నాయి. మద్యపానం, మాదక

ద్రవ్యాల అలవాట్ల కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామా జికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. మత్తు పదార్థాల కోసం చేసే విపరీతమైన ఖర్చుల వల్ల ఇళ్లలోని మహి ళలు రోజువారీ గృహ అవసరాలను తీర్చలేక సతమతమవు తున్నారు. దీనివల్ల భార్యాభర్తల మధ్య, తల్లిదండ్రులు – పిల్లల మధ్య తీవ్రమైన ఘర్షణలు చోటుచేసుకుని, గృహ హింస పెరిగిపోతోంది. చివరకు ఈ గొడవలు హత్యలు, ఆత్మహత్యల వంటి దారుణాలకు దారితీస్తున్నాయి.



**మద్యపానం, మాదక ద్రవ్యాల అలవాట్ల కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. మత్తు పదార్థాల కోసం చేసే విపరీతమైన ఖర్చుల వల్ల ఇళ్లలోని మహిళలు రోజువారీ గృహ అవసరాలను తీర్చలేక సతమతమవుతున్నారు. దీనివల్ల భార్యాభర్తల మధ్య, తల్లిదండ్రులు - పిల్లల మధ్య తీవ్రమైన ఘర్షణలు చోటుచేసుకుని, గృహ హింస పెరిగిపోతోంది. చివరకు ఈ గొడవలు హత్యలు, ఆత్మహత్యల వంటి దారుణాలకు దారితీస్తున్నాయి.**

పర్యవసానంగా, ఎంతోమంది చిన్నారి పిల్లలు పసిప్రాయంలోనే తల్లిదండ్రుల నీడను కోల్పోయి అనాథలుగా మారుతున్నారు.

ఈ వినాశకర పరిస్థితులను అరికట్టేందుకు ప్రభుత్వాలు, చట్టాలను అమలు చేసే సంస్థలు కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఆసన్నమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ఎల్బీ స్టేడియంలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలన విషయంలో తెలంగాణను కాపాడుకునేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కేంద్ర హోంశాఖ, దేశ రక్షణ దళాలు అంతర్జాతీయ సరిహద్దుల్లో గట్టి నిఘా ఉంచినప్పటికీ, స్థానిక చెక్‌పోస్టులు, టోల్‌గేట్లు, రేవుల ద్వారా దేశంలోకి డ్రగ్స్ ఎలా ప్రవేశిస్తున్నాయనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. కేవలం మాటలతో కాకుండా, ఆచరణలో కఠినమైన తనిఖీలు నిర్వహించాల్సి ఉంది.

గతంలో ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొన్ని దశల్లో అఫియున్ సాగుపై కఠిన నియంత్రణ చర్యలు చేపట్టిన ఉదాహరణలు ఉన్నాయి. భారతదేశంలో కూడా యువత భవిష్యత్తును కాపాడటానికి, ఇలాంటి కఠిన నిర్ణయాలు, మద్యపాన నిషేధం వంటి విధానాలను మరింత పకడ్బందీగా అమలు చేయాలి.

ఎంతవరకూ మనం సాంకేతికత, ఆధునికత వైపు అడుగులు వేస్తున్నామని సంతోషిస్తున్నామే తప్ప, లోపల మన యువతరం మత్తు పదార్థాల ఊబిలో మునిగిపోతుండటాన్ని గమనించలేక పోతున్నాము. కేవలం పోలీసు వ్యవస్థపైనే భారం వేయకుండా, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలి.

విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలి. అలాగే ఈ సమస్య కేవలం చట్ట అమలుతోనే పరిష్కారమయ్యేది కూడా కాదు. నిరుద్యోగం, మానసిక ఒత్తిడి, కుటుంబ విభేదాలు, ఒంటరితనం, సోషల్ మీడియా ప్రభావం, స్నేహితుల ఒత్తిడి వంటి అనేక కారణాలు యువతను మత్తు పదార్థాల వైపు నెడుతున్నాయి. అందువల్ల డ్రగ్స్ వ్యతిరేక పోరాటం పోలీసు శాఖ బాధ్యత మాత్రమే కాదు; కుటుంబాలు, విద్యాసంస్థలు, మేధావులు, మతపెద్దలు, వైద్య నిపుణులు, కౌన్సిలర్లు, మీడియా, యువత అందరూ కలిసి నిర్వహించాల్సిన సామాజిక ఉద్యమం. యువతకు ఉపాధి అవకాశాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులోకి వచ్చినప్పుడే, ఈ డ్రగ్స్ మహమ్మారిని దేశం నుండి శాశ్వతంగా తరిమికొట్టి, ఆరోగ్యకరమైన, సంపన్నమైన నవ సమాజాన్ని నిర్మించగలము.

యువత దేశానికి భవిష్యత్తు మాత్రమే కాదు, వర్తమానం కూడా. ఆ వర్తమానం మత్తు కోరల్లో చిక్కుకుంటే దేశ భవిష్యత్తే ప్రమాదంలో పడుతుంది. అందువల్ల మాదకద్రవ్యాల నిర్మూలనను కేవలం నేర నియంత్రణ సమస్యగా కాకుండా, జాతీయ ఆరోగ్యం, కుటుంబ వ్యవస్థ, సామాజిక భద్రతకు సంబంధించిన అత్యవసర ప్రజా ఉద్యమంగా పరిగణించి సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉంది. ✤



إِنَّا لِلَّٰهِ وَإِنَّا إِلَيْهِ رَاجِعُونَ

# అస్తమించిన ఉజ్వల తార

**ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

'మౌతుల్ ఆలిమ్ మౌతుల్ ఆలమ్' అనేది ఒక అరబీ నానుడి. అంటే 'పండితుని మరణం ప్రపంచ మరణం' అని దీనికి అర్థం. పాతికేళ్ళ క్రితం విశ్వ విఖ్యాత ఇస్లామీయ విద్వాంసులు మౌలానా అబుల్ హసన్ అలీ నద్వి (అలీమియా) మరణించినప్పుడు గీటురాయిలో వచ్చిన సంపాదకీయానికి సరిగ్గా ఇదే మకుటం పెట్టారు. ఇప్పుడు నేను **మౌలానా సయ్యిద్ సల్మాన్ హుసైనీ నద్వీ** మరణంపై అంత గంభీరమైన మకుటం పెట్టడానికి సాహసించలేను గాని భారత ఉపఖండంలోని ఓ గొప్ప పండితుడు అస్తమించారని మాత్రం నిస్సంకోచంగా చెప్పగలను.

మౌలానా సయ్యిద్ సల్మాన్ హుసైనీ నద్వీ మౌలానా అలీమియా గారి ముద్దుల మనవడు. 29-6-2026వ తేదీ సోమవారం నాడు ఉదయం ఆయన స్వల్ప అస్వస్థతకు గురై 72 ఏండ్ల వయసులో ఊర్ధ్వ లోకాలకు సాగిపోయారు. వేలాదిమంది శిష్యులు, శ్రేయోభిలాషులు లక్నోలో ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు.

**జ్ఞాన ఖని**

మౌలానా సయ్యిద్ సల్మాన్ నద్వీ ఓ పెద్ద జ్ఞాన ఖని. లక్నోలోని 'నద్వతుల్ ఉలమా' విద్యా పీఠంలోనే చదువుకున్నారు. 1980లో సవూదీ అరేబియాలోని ఇమామ్ ముహమ్మద్ బిన్ సవూద్ ఇస్లామిక్ యూనివర్సిటీ నుండి హదీసు విద్యలో స్పెషలైజేషన్ చేశారు. సవూదీ అరేబియాతో సహా అనేక గల్ఫ్ దేశాల నుండి ఆయనకు మంచి ఆఫర్లు వచ్చాయి. కాని ఆయన మాత్రం తన తాత గారు రెక్టర్ (ముహ్తమిమ్)గా సేవలందించిన 'నద్వా'లోనే అధ్యాపకునిగా చేరారు. సుదీర్ఘ కాలం వరకు నద్వాలోని 'ఫేకల్టీ ఆఫ్ దావా అండ్ షరియా'లో డీన్‌గా సేవలందించారు.

## విద్యా సేవలు

మౌలానా సల్మాన్ నద్వీ ఒక విద్యావేత్త. భారతదేశంలోని అనేక విద్యాపీఠాలకు ఛాన్సలర్‌గా ఉన్నారు. 'జమీఅతె షబాబుల్ ఇస్లామ్' అనే యువజన సంస్థను స్థాపించి, దానికి సంరక్షకులుగా ఉన్నారు. ఆయన క్రమశిక్షణలో రాటుదేలిన వందలాది మంది శిష్యులు ప్రపంచవ్యాప్తంగా సందేశ ప్రధానమైన కృషి చేస్తున్నారు. ఉత్తరాదిలో మెడికల్ కాలేజీలు, ఇంజనీరింగ్ కాలేజీల స్థాపనలో కూడా ఆయన తన వంతు సహకారం అందజేశారు.

మౌలానా సయ్యిద్ సల్మాన్ నద్వీ హుసైనీ వంశ వృక్షం హజ్రత్ అలీ పుత్రరత్నమైన ఇమామ్ హుసైన్‌తో కలుస్తుందని చెప్పుకుంటారు.

మౌలానా సల్మాన్ నద్వీ ఓ మహా వక్త. ఆయన దర్సె హదీస్ ఇచ్చినా, జుమా ప్రసంగాలు చేసినా, బహిరంగ సభల్లో ఉపన్యసించినా వేటికవే ప్రత్యేకంగా ఉండేవి. ముఖ్యంగా పబ్లిక్ మీటింగ్స్‌లో ఆయన చేసే నదీ ప్రవాహం లాంటి ఉపన్యాసాలు ప్రేక్షకుల్ని విశేషంగా ఆకర్షించేవి, అలరించేవి. ఆలోచింపజేసేవి. హైదరాబాద్‌లోని ధార్మిక సంస్థలు, విద్యాసంస్థల వారు ఆయన్ని అతిథి వక్తగా ఆహ్వానించేవారు. 1999లో మౌలానా తఖీయుద్దీన్ గారి ఆహ్వానంపై ఆయన వచ్చి అల్ హఖ్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు శామీర్‌పేట, గజ్వేల్ డివిజన్లలో పర్యటించారు. ఆ సందర్భంగా శామీర్‌పేట, గజ్వేల్ బహిరంగ సభలలో తెలుగు వక్తగా ఆయనతో వేదికను పంచుకునే అవకాశం నాకు లభించింది. 1999లోనే మౌలానా తఖీయుద్దీన్ గారి ఉత్తరాన్ని ఆయనకు అందజేయడానికి నేను లక్నో వెళ్ళినప్పుడు నా మిత్రులు అబ్దుల్ వకీల్‌తో కలిసి ఆయన నివాస గృహానికి వెళ్ళాను. ఆయన నివాస గృహాన్ని చూసిన మాకు, దానిని ఆయన గారి నిరాడంబరత అనాలో, పేదరిక ప్రభావం అనాలో అర్థం కాలేదు. ఆయన మమ్మల్ని ఎంతో ఆప్యాయంగా పలకరించారు. "లక్నో వచ్చారు కదా, నద్వా చూశారా, ఇమామ్ బాడాకు వెళ్ళారా?" అని అడిగారు. 'నద్వాలోనే బస చేశాము. కాని ఇమామ్ బాడాకు వెళ్ళే టైం లేదండి, రేపే గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ద్వారా హైదరాబాద్‌కు వెళుతున్నామ'ని చెప్పాము.

## అంతర్జాతీయ స్థాయి వ్యక్తిత్వం

2001 జులైలో మౌలానా సల్మాన్ నద్వీ యు.కె.లోని బర్మింగామ్ పట్టణంలో జమీఅతె అహ్లె హదీస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆ సమయంలో నేనూ, మౌలానా తఖీయుద్దీన్ గారు అక్కడే ఉన్నాము. మమ్మల్ని చూసి, "ఎక్కడ గజ్వేల్? ఎక్కడ బర్మింగామ్? అల్లాహ్ మనల్ని ఎక్కడెక్కడ కలుపుతున్నాడో చూడండి" అంటూ ఎంతో ఆహ్లాదంగా పలకరించారు.

2017లో రాయచోటి పట్టణంలో జరిగిన సీరతున్నబీ సభలో ప్రసంగించడానికి సల్మాన్ నద్వీ వచ్చారు. దాదాపు 5వేల మంది హాజరైన ఆ సభలో నేను కూడా తెలుగు వక్తగా ప్రసంగించాను.

మౌలానా సల్మాన్ నద్వీ ముక్కుసూటిగా మాట్లాడేవారు. దాపరికం లేకుండా, చెప్పదలచిన విషయాన్ని నిర్భయంగా, నిస్సంకోచంగా, నిర్ద్వంద్వంగా చెప్పేవారు. అరబ్బు దేశాల వారు విలాసవంతమైన జీవితానికి అలవడి సామ్రాజ్యవాదుల అడుగులకు మడుగులొత్తుతున్నారని విమర్శించేవారు. భారత రాజకీయాలలో ముస్లింల నాయకత్వ లోపాలను ఎండగట్టేవారు.

మౌలానా సల్మాన్ నద్వీ గారు మౌలానా ఖలీలుర్రహ్మాన్ సజ్జాద్ నోమాని గారికి సమకాలికులు. ఇద్దరూ నద్వాలోనే చదువుకున్నారు. ఇద్దరూ అరబ్బు దేశాలలో ఉన్నత చదువులు చదివారు. ఒకరు ఖుర్‌ఆన్‌లో తఖస్సుస్ చేస్తే, ఒకరు హదీసులో స్పెషలైజేషన్ చేశారు. ఇద్దరూ గొప్ప వక్తలే. ఇద్దరూ లక్నో వాస్తవ్యులే. కాకపోతే వారిద్దరి శైలి వేర్వేరుగా ఉంటుంది. ఒకరి ఉపన్యాసంలో 'జమాల్' ఉంటే, మరొకరి ప్రసంగంలో 'జలాల్' ఉంటుంది. కారుణ్య ప్రభువు వారిద్దరి చేత గొప్ప పనులు చేయించుకున్నాడు. ఇప్పుడు ఆ ఇద్దరిలో ఒక ఉజ్వల తార అస్తమించింది. అల్లాహ్ ఉమ్మత్‌కు ఆయన లేని లోటును తీర్చాలని, ఆయన సేవలను సమ్మతించి ఆమోదించాలని, ఉన్నత స్వర్గవనాలలో ఆయనకు ప్రవేశం కల్పించాలని ప్రార్థన. (ఆమీన్) ✤

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




**- నసీరా బేగం**

**ప్రపంచం**లోని ప్రజలందరి సామర్థ్యాలు ఒకేవిధంగా ఉండవు. ఒక వ్యక్తిలో ఒక ప్రత్యేక సామర్థ్యం ఉంటే, మరొకరిలో వేరొక విధమైన నైపుణ్యం ఉంటుంది. ఈ కారణంగానే, ప్రపంచంలోని ప్రతి పనిని ప్రతి మనిషి చక్కగా నిర్వహించలేడు. అలాగే, అందరూ కలిసి సమైక్యంగా నిర్వహించవలసిన కార్యక్రమాలను ఒకే వ్యక్తి ఒంటరిగా పూర్తి చేయలేడు. ఎవరిలో ఏ విధమైన సామర్థ్యం దాగి ఉంటుందో, వారు మాత్రమే ఆ పనిని సక్రమంగా నిర్వహించ గలరు. కనుక, వ్యక్తి యొక్క శక్తి సామర్థ్యాలను చక్కగా అంచనా వేసి, బాధ్యతలను ఎవరికి తగ్గట్టుగా వారికి అప్పగించాలి. ఒకవేళ అలా చేయని పక్షంలో, ఆ పనులు సక్రమంగా నెరవేరకపోవడమే కాకుండా, దానివల్ల తీవ్రమైన నష్టాలను కూడా చవిచూడవలసి వస్తుంది. సామర్థ్యాన్ని బట్టి బాధ్యతలను అప్పగించడం అనేది కుటుంబ వ్యవహారాల నుండి ఆఫీసు, కంపెనీ, రాజకీయ, సామాజిక వ్యవహారాల వరకు అన్నింటికీ వర్తిస్తుంది.

నేడు మన సమాజంలో ప్రబలుతున్న రుగ్మతల్లో ప్రధానమైనది- అత్యంత కీలకమైన పనులను తగిన సామర్థ్యం లేని వ్యక్తులకు అప్పజెప్పడం. అదే సమయంలో, గొప్ప శక్తి సామర్థ్యాలు కలిగిన వ్యక్తుల పట్ల నిర్లక్ష్యం వహించడం విచారకరం. కారుణ్యమూర్తి అయిన మహాప్రవక్త ముహమ్మద్ (స) ప్రజల్లో దాగి ఉన్న సామర్థ్యాలను గుర్తించి, వారికి తగిన బాధ్యతలను అప్పగించేవారు. వారి నైపుణ్యాలను మరింతగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక శిక్షణా తరగతులను కూడా ఏర్పాటు చేసేవారు. ఆ కారణం చేతనే, దైవప్రవక్త(స) గారి అనుచరులు తమకు అప్పగించిన బాధ్యతలను అత్యంత నిబద్ధతతో, బాధ్యతాయుతంగా నిర్వహించేవారు. అందుకే ఆనాడు ఇస్లామ్ ధర్మం అత్యంత వేగంగా నలుదిశలా వ్యాపించింది.

హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్(ర) గారికి, దైవప్రవక్త (స) గారు ఇచ్చిన 'సిద్దీఖ్' (సత్యవంతుడు) అనే బిరుదుతో ఆయన ప్రఖ్యాతి గాంచారు. ఆయన పలికే ప్రతి మాట, చేసే ప్రతి పని సత్యంతో నిండి ఉండేది. ఆయనలోని మరో గొప్ప సుగుణం---మృదు స్వభావం. ఆపదల్లో, కష్టాల్లో ఉన్నవారిని చూసి ఆయన ఎంతో బాధపడేవారు మరియు తమ శక్తికి మించి వారిని ఆదుకోవడానికి ప్రయత్నించేవారు. దైవప్రవక్త(స) ఆయన వ్యక్తిత్వాన్ని చూసి అమితంగా సంతోషించేవారు. ఒకసారి హజ్రత్ అమ్రు బిన్ ఆస్(ర) దైవప్రవక్త (స) గారితో, "ఓ దైవప్రవక్తా! మీకు అత్యంత ప్రియమైన వ్యక్తి ఎవరు?" అని అడిగారు. అప్పుడు దైవప్రవక్త (స), "నాకు అత్యంత ప్రియమైన వ్యక్తి అబూబకర్ సిద్దీఖ్" అని సమాధానమిచ్చారు. మరొక సందర్భంలో ఆయన ఇలా సెలవిచ్చారు: "నేను ఒకరిని ప్రాణ స్నేహితుడిగా ఎంచుకోవలసి వస్తే, హజ్రత్ అబూబకర్ (ర)నే ఎంచుకుని ఉండేవాడిని." ఆయనలోని ఈ గుణ విశేషాల కారణంగానే, దైవప్రవక్త (స) రహస్యంగా మక్కా నుంచి మదీనాకు వలస వెళ్లే అత్యంత కఠిన సమయంలో, తన ప్రయాణ సహచరుడిగా హజ్రత్ అబూబకర్ (ర) గారినే ఎన్నుకున్నారు. అంతేకాదు, దైవప్రవక్త (స) నిర్వహించే సకల వ్యవహారాల్లోనూ ఆయనకే ప్రాధాన్యత ఇచ్చేవారు.

దైవప్రవక్త (స) తన ప్రవక్త పదవిని ప్రకటించిన వెంటనే తన సంపద మొత్తాన్ని దైవధర్మం కోసం ఆయన వెచ్చించేవారు. దైవప్రవక్త (స) పవిత్ర నోటితో వెలువడే ప్రతి మాటనూ విశ్వసించి, తు.చ తప్పకుండా ఆచరించేవారు. ఆయనలోని ఈ గుణ విశేషాలన్నింటినీ దృష్టిలో ఉంచుకున్న దైవప్రవక్త (స), తన జీవిత చివరి ఘడియల్లో హ్జ్రత్ అబూబకర్ (ర)ను నమాజుకు నాయకత్వం వహించమని ఆదేశించారు. ఈ ఆదేశం, "నా తర్వాత మీ ఖలీఫా అబూబకర్ (ర)యే" అనే అంతరార్థాన్ని కలిగి ఉంది.

దైవప్రవక్త (స) పరమపదించిన సమయంలో అనుచరుల్లో నిరాశా నిస్పృహలు ఆవహించాయి. వారు దుఃఖ సాగరంలో మునిగి పోయారు. అటువంటి క్లిష్ట సమయంలో హ్జ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (ర) సహనంతో, అపారమైన వివేకంతో సహాబాలను ఉద్దేశించి ఇలా ప్రసంగించారు: "ప్రజలారా! ఎవరైతే దైవప్రవక్త ముహమ్మద్ (స)ను ఆరాధించేవారో, వారు తెలుసుకోండి-ముహమ్మద్ (స) పరమపదించారు. ఎవరైతే అల్లాహ్‌ను ఆరాధించేవారో వారు తెలుసుకోండి---అల్లాహ్ నిత్య సజీవుడు. ఆయనకు మరణం లేదు." ఆ తర్వాత ఆయన ఖురాన్ గ్రంథం లోని ఈ వాక్యాన్ని పఠించారు: "ముహమ్మద్ (స) ఒక ప్రవక్త తప్ప మరేమీ కారు. అతనికి పూర్వం ఎందరో ప్రవక్తలు గతించారు. అలాంటప్పుడు, ఒకవేళ అతను మరణిస్తే లేదా హత్య చేయ బడితే మీరు వెనుకంజ వేసి మరలిపోతారా? జ్ఞాపకం ఉంచు కోండి, మరలిపోయేవాడు అల్లాహ్‌కు ఏమాత్రం నష్టం కలిగించ లేడు. కానీ, అల్లాహ్‌కు కృతజ్ఞత చూపే దాసులుగా జీవించేవారిని ఆయన తగువిధంగా బహుకరిస్తాడు" (3:144). ఈ విధంగా హ్జ్రత్ అబూబకర్ (ర) సందర్భానుగుణంగా ప్రజలకు బోధించి, వారిని ప్రశాంతపరిచారు. వారి హృదయాల్లో ధైర్యాన్ని, సహనాన్ని నింపారు. హ్జ్రత్ అబూబకర్ (ర)లోని ప్రతిభా పాటవాలను గుర్తించే దైవప్రవక్త (స) ఆ బాధ్యతను ఆయనకు అప్పగించారు.

అదేవిధంగా, రెండో ఖలీఫా అయిన హ్జ్రత్ ఉమర్ (ర) శక్తి సామర్థ్యాలను గ్రహించిన దైవప్రవక్త (స) ఇలా ప్రార్థించారు: "ఓ అల్లాహ్! ఉమర్(ర) ద్వారా ఇస్లామ్ ధర్మాన్ని పటిష్టపరచు." ఆయనలోని ధైర్యసాహసాలు, సంకల్పశుద్ధి, దూరదృష్టిని చూసిన ప్రవక్త (స), "నా తర్వాత ప్రవక్త పదవిని ఎవరికైనా ఇవ్వవలసి ఉంటే, అల్లాహ్ తప్పకుండా హ్జ్రత్ ఉమర్ (ర)కే ఇచ్చేవాడు" అని కొనియాడారు. హ్జ్రత్ అబూబకర్ (ర) పరమపదించిన తర్వాత ప్రజలు హ్జ్రత్ ఉమర్ (ర)ను ఖలీఫాగా ఎన్నుకున్నారు. అత్యంత ధైర్యవంతులైన ఉమర్ (ర) దైవ భయంతో కంపించి పోయేవారు. ప్రజలకు న్యాయం చేసేందుకు ఆయన చేసిన కృషి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడింది. అసత్యాన్ని, అన్యాయాన్ని ఏమాత్రం సహించని ఆయన, వాటిని రూపుమాప డానికి ఎల్లప్పుడూ సంసిద్ధులై ఉండేవారు. ప్రజల స్థితిగతులను తెలుసుకోవడానికి రాత్రివేళల్లో రహస్యంగా గస్తీ తిరిగేవారు. అనాథలకు, వితంతువులకు, అగత్యపరులకు సహాయ సహకారాలను ముమ్మరంగా అందించేవారు. హ్జ్రత్ ఉమర్ (ర) వ్యక్తిత్వాన్ని మెరుగుపరిచింది దైవప్రవక్త (స) గారి శిక్షణే.

హ్జ్రత్ ఉమర్ (ర) తర్వాత హ్జ్రత్ ఉస్మాన్ గని (ర) ఖలీఫాగా ఎన్నికయ్యారు. ఆయన మృదు స్వభావి, దయాగుణం కలవారు, అత్యధికంగా దానధర్మాలు చేసేవారు. అల్లాహ్ మార్గంలో ఖర్చు చేసే విషయంలో ఆయన అందరికంటే ముందుండేవారు. ఖురాన్ గ్రంథం మొత్తాన్ని కంఠస్థం చేసిన ఆయన నరనరాల్లో దైవ ప్రేమ, దైవభయం జీర్ణించుకుపోయి ఉండేవి. ఆయనలోని అసంఖ్యాక మైన గుణ విశేషాలను, సామర్థ్యాలను గుర్తించి దైవప్రవక్త (స), మదీనా పట్టణంలో అనేకసార్లు ఆయన్ని తన ప్రతినిధిగా (ఖలీఫాగా) నియమించారు. ఆ బాధ్యతలను ఆయన అత్యంత న్యాయంగా నిర్వహించారు.

ఆ తర్వాత నాల్గవ ఖలీఫాగా హ్జ్రత్ అలీ (ర)ను ప్రజలు ఎన్నుకు న్నారు. ఆయన ప్రత్యేకత ఏమిటంటే, అత్యంత పిన్న వయసు లోనే ఇస్లామ్‌ను స్వీకరించి, బాలురలో అందరికంటే ముందుగా విశ్వసించినవారిగా గుర్తింపు పొందారు. బాల్యం నుంచే దైవప్రవక్త(స) గారి శిక్షణలో గడిపే భాగ్యం ఆయనకు లభించింది. ఆ కారణంగా, దైవధర్మ జ్ఞానంలో, వివేకంలో ప్రత్యేక స్థానాన్ని పొందారు. యుద్ధాలలో అత్యంత ధైర్యసాహసాలతో పోరాడిన ఆయన గురించి, ఖైబర్ యుద్ధ సమయంలో దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "నేను ఒక వ్యక్తి చేతుల్లో యుద్ధపు జెండాను ఇవ్వబోతున్నాను. అతని ద్వారా అల్లాహ్ విజయాన్ని ప్రసాదిస్తాడు. అతను అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను ప్రేమిస్తాడు. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త కూడా అతన్ని ప్రేమిస్తారు." దైవప్రవక్త (స) పలికిన ఈ మాట అక్షరాలా నిజమైంది.

ఈ విధంగా మనం ఇస్లామ్ చరిత్ర పుటలను తిరగేస్తే, దైవప్రవక్త (స) తమ అనుచరుల శక్తిసామర్థ్యాలను, ప్రతిభా పాటవాలను గుర్తించి, తగిన బాధ్యతలను అప్పగించేవారని అర్థమవుతుంది. వారు కూడా తమ నాయకుడు అప్పగించిన బాధ్యతను దైవ అమానతుగా (నమ్మకంగా) భావించారు. పరలోకంలో దేవుని సమక్షంలో హాజరై సమాధానం చెప్పుకోవలసి ఉంటుందనే భయంతో వాటిని సక్రమంగా నిర్వహించారు. అందుకే వారి చరిత్ర సువర్ణాక్షరాలతో లిఖించబడింది.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది    ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

29 ఆయత్‌లు    మదీనా అవతరణ

# 48. అల్ ఫత్హ్

18 – 19 అల్లాహ్ విశ్వాసుల పట్ల ప్రసన్నుడయ్యాడు, వారు చెట్టు క్రింద నీతో ప్రమాణం చేస్తూ ఉన్నప్పుడు. వారి హృదయాల స్థితి ఆయనకు తెలుసు, అందువల్ల ఆయన వారికి ప్రశాంతతను అవతరింపజేశాడు.[33] వారికి బహుమానంగా సమీప విజయాన్ని అనుగ్రహించాడు, ఇతోధిక యుద్ధప్రాప్తినీ ప్రసాదించాడు, దీన్ని వీరు (అతిత్వరలో) పొందనున్నారు.[34] అల్లాహ్ మహా బలోపేతుడు, విజ్ఞుడు కూడా. అల్లాహ్ మీకు అత్యధిక యుద్ధప్రాప్తులను గురించి వాగ్దానం చేస్తున్నాడు, వాటినీ మీరు పొందనున్నారు.[35]

వెంటనే ఈ విజయాన్నయితే ఆయన మీకు అనుగ్రహించాడు,[36] జనుల చేతులు మీపైకి లేవకుండా ఆపివేశాడు,[37] ఇది విశ్వాసుల కొరకు ఒక సూచన కాగలగాలనీ,[38] అల్లాహ్ మీకు రుజుమార్గం వైపునకు దారి చూపాలనీను.

33. ఇక్కడ ప్రశాంతత అంటే ప్రత్యేక మానసిక స్థితి. అందులో ఒక వ్యక్తి ఏదయినా మహత్తరమయిన లక్ష్యం కొరకు నింపాదిగా, పూర్తిగా స్థిమితం, సంతృప్తితో, ప్రమాదం నోటి లోకి చొరబడి పోతాడు. ఎటువంటి భయంగాని వ్యాకులతగాని దరిచేరనివ్వ కుండా నిర్ణయం గైకొంటాడు – ఈ మహత్కార్యం ఎలాగయినా నిర్వర్తించాలని, ఫలితం ఏ విధంగా వెలువడినా సరే అన్న భావంతో.

34. ఇది ఖైబర్ విజయం, దాని యుద్ధప్రాప్తికి సంబంధించిన సంకేతం. ఈ ఆయత్ విశదీకరిస్తోంది, ఈ బహుమానం కేవలం బయ్‌తుర్రిజ్వాన్‌లో పాల్గొన్నవారికే అల్లాహ్ ప్రత్యేకిం చాడనీ, వారు తప్ప ఇతరులకు ఆ విజయంలోనూ, ఆ సొమ్ముల్లోనూ పాలు పంచుకునే హక్కు లేదని. ఈ కారణంగానే సఫర్ నెల, హిజ్రీ 7వ సంవత్సరం దైవ సందేశహరులు (స) ఖైబర్‌పైన దాడికి బయలుదేరినప్పుడు ఆయన కేవలం వారినే తోడుగా తీసుకు వెళ్ళారు. అయితే నిశ్చయంగా ప్రవక్త మహనీయులు (స) అబీసీనియా నుండి తిరిగి వచ్చిన కొందరు ముహాజిర్లకు 'దూసీ', 'అష్‌అరీ' సహచరులకు సయితం ఖైబర్ సొమ్ములో కొంత భాగం ఇచ్చినమాటా వాస్తవమే. కాని అది 'ఖుమ్స్' (ప్రభుత్వ భాగం) నుండి ఇవ్వబడింది లేదా 'రిజ్వాన్' సహచరుల ఆమోదంతో ఇవ్వబడింది. ఎవరినీ ఆ సొమ్ముల్లో వారి హక్కు ఉన్నట్లు వాటా దారులుగా చేయలేదు.

35. దీని ఉద్దేశం, ఖైబర్ తరువాత ముస్లిములకు నిరంతరం ప్రాప్తమవుతూ ఉన్న ఇతర విషయాలు అన్నది.

36. దీనిభావం హుదైబియా సంధి, దీన్ని సూరా ప్రారంభంలో స్పష్టమయిన విజయంగా పేర్కొనడం జరిగింది.

37. అంటే ఆయన ఖురైష్ తిరస్కారులకు, హుదైబియా ప్రాంతంలో మీతో పోరాడటానికి ధైర్యం ఇవ్వలేదని, నిజానికి బాహ్య పరిస్థితులన్నింటి రీత్యా వారు చాలా మంచి పొజిషన్‌లో ఉన్నారనీ, యుద్ధ దృక్కోణంతోనయితే మీరు వారికి ప్రతిగా చాలా బలహీనులుగా ఉన్నారు అని భావం. అంతేకాక దీని భావం మరొకటీ ఉంది – ఏ శత్రుశక్తికీ ఆ కాలంలో మదీనా పైకి దండెత్తే సాహసమూ కలగలేదు, పధ్నాలుగు వందల మంది యుద్ధం చేయగల పురుషులు వెళ్ళిపోయిన తరువాత మదీనా మైదానం చాలా బలహీనమయి పోయింది యూదులు, బహు దైవారాధకులు, ద్వంద్వనీతిపరులూ ఈ అవకాశంతో ప్రయోజనం పొందగలిగేవారే.

38. సూచన అంటే, అల్లాహ్ ఆయన సందేశహరుని విధేయ తలో నిలకడ కనబరిచేవారికి, అల్లాహ్‌పైన భారం మోపి సత్యాన్ని సన్మార్గాన్నీ బలపరిచేందుకు లేచి నిలబడేవారికి అల్లాహ్ తన సహాయం, సహకారం, సఫలతను ఎలా అనుగ్ర హిస్తాడో అనే విషయాన్ని తెలిపే సూచన అని భావం.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ التَّفْسِيرِ
## ఖుర్ఆన్ వ్యాఖ్యాన ప్రకరణం
**(కితాబుత్తఫ్సీర్)**

**12. యూసుఫ్ సూరా**

## అత్యుత్తమ సహనం

(కుమారుల కట్టుకథను విని) వారి తండ్రి ఇలా అన్నాడు: "మీ దుష్ట మనస్సులు మీచేత ఒక ఘోరకార్యాన్ని చాలా తేలికగా చేయించాయి. సరే, ఓర్చుకుంటాను. బాగా ఓర్చుకుంటాను. మీరు కల్పిస్తున్న మాటల విషయంలో సహాయం కోసం అల్లాహ్‌నే అర్థించాలి." *(12: 18)*

**533)** ఉర్వా బిన్ జుబైర్, సయీద్ బిన్ ముసయ్యిబ్, అల్ఖమా బిన్ వక్కాస్, ఉబైదుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్‌ల ద్వారా జుహ్రీ విన్న కథనం– మహాప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా(ర.అ)పై మోపబడిన అపనింద సంఘటన గురించి వారు విన్నారు. అపనింద మోపేవారు ఆమెపై అపనిందను మోపినప్పుడు, అల్లాహ్ ఆమె సౌశీల్యాన్ని (గురించి ఆయత్‌లు) అవతరింపజేశాడు– వీరంతా ఆ సంఘటనకు సంబంధించిన ఒక్కొక్క భాగాన్ని తనకు వినిపించారని ఉల్లేఖకుడు అన్నారు: దైవప్రవక్త (తన భార్య ఆయిషా–ర.అతో) ఇలా అన్నారు: "ఒకవేళ నీవు గనక శీలవతివి అయివుంటే అల్లాహ్ త్వరలోనే నీ సౌశీల్యాన్ని చాటే విషయం అవతరింపజేస్తాడు. కాని నీ వల్ల గనక తప్పు జరిగివుంటే, క్షమాపణకై అల్లాహ్‌ను వేడుకో. ఆయన సన్నిధిలో పశ్చాత్తాప పడు."

(ఆయిషా–ర.అ–ఇలా అన్నారు) అది విని నేనిలా అన్నాను– "దైవసాక్షిగా! నా ఉపమానం, మీ ఉపమానం యూసుఫ్ (అలైహిస్సలామ్) తండ్రి లాంటిది.[1] (ఆ సందర్భంగా ఆయన చెప్పిన మాటల్నే నేను చెబుతాను) 'సరే, ఓర్చుకుంటాను. బాగా ఓర్చుకుంటాను. మీరు కల్పిస్తున్న మాటల విషయంలో సహాయం కోసం అల్లాహ్‌నే అర్థించాలి." *(12: 18)*

ఆ తరువాత అల్లాహ్ ఆయిషా(ర.అ) సౌశీల్యం, పారిశుధ్యం గురించి నూర్ సూరాలోని పది ఆయత్‌లను అవతరింప జేశాడు (ఈ అభాండాన్ని సృష్టించి తీసుకువచ్చినవారు, మీలోని ఒక వర్గం వారే... 24: 11–20)

**534)** ఉమ్మె రూమాన్(ర.అ) తనతో చెప్పినట్లుగా మస్రూఖ్ బిన్ అజ్దా తెలియజేశారు: ఆమె ఆయిషా(ర.అ) తల్లి. ఆమె ఇలా అన్నారు– "ఆయిషా(ర.అ) కూర్చుని ఉండగానే ఒక్కసారిగా ఆమెకు జ్వరం తీవ్రమయింది." "నలువైపులా వ్యాపిస్తున్న వదంతుల కారణంగా బహుశా ఇలా అయి ఉంటుంద"ని దైవ ప్రవక్త(స) అభిప్రాయపడ్డారు. నేను 'అవున'[1]న్నాను. ఆ తర్వాత ఆయిషా(ర.అ) కూర్చుని ఇలా అన్నారు: "నేనూ మరియు మీ ఉపమానం యాఖూబ్ (అలైహిస్సలాం), ఆయన కొడుకుల వంటిది. యాఖూబ్ ఇలా అన్నారు: 'మీ దుష్ట మనస్సులు మీచేత ఒక ఘోర కార్యాన్ని చాలా తేలికగా చేయించాయి. సరే, ఓర్చుకుంటాను. బాగా ఓర్చుకుంటాను. మీరు కల్పిస్తున్న మాటల విషయంలో సహాయం కోసం అల్లాహ్‌నే అర్థించాలి.'

*533-1. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ హదీసును ఇక్కడ తీసుకురావటంలోని ముఖ్య ఉద్దేశం, హజ్రత్ యూసుఫ్(అ) తండ్రి వృత్తాంతం ఇందులో ప్రస్తావనకు రావటమే. తీవ్రమైన దుఃఖానికి లోనై ఉన్న ఆయిషా(ర.అ)కు ఆ సమయంలో యూసుఫ్ (అ) తండ్రి యాఖూబ్(అ) పేరు జ్ఞప్తికి రాలేదు. అందుకే ఆమె గారు 'యూసుఫ్ తండ్రి' అని అన్నారు.*

*534-1. ఆయిషా(ర.అ) తల్లి ఉమ్మె రూమాన్(ర.అ) దైవప్రవక్త(స) పరమపదించిన తరువాత కూడా చాలా కాలం వరకు జీవించి ఉన్నారు. అందుచేతనే తాబయి అయిన మస్రూఖ్ ఈ హదీసును ఆమె ద్వారా విన్నారు. ఉమ్మె రూమాన్ దైవ ప్రవక్త(స) కాలంలోనే మరణించారన్న ఉల్లేఖనం సరైనది కాదు.*

# కూల్చివేతల కాలం

ఏజాజ్ అహ్మద్



**భారతదేశం అంటేనే భిన్నత్వంలో ఏకత్వం.** శతాబ్దాల కాలంగా విభిన్న మతాలు, సంస్కృతులు, ఆచార వ్యవహారాల సమాహారంగా ఈ గడ్డ వర్ధిల్లుతోంది. ఈ దేశ అస్తిత్వం కేవలం దాని భౌగోళిక సరిహద్దుల్లోనో, చారిత్రక పుటల్లోనో లేదు; విభిన్న సామాజిక శక్తులను తనలో లీనం చేసుకున్న సమన్వయ సంస్కృతిలో ఉంది. అందుకే మన నాగరికతను 'గంగా-జమునా తెహజీబ్' అని పిలుచుకుంటాం. విభిన్న నమ్మకాలు కలిగిన ప్రజలు ఒకరినొకరు గౌరవించుకుంటూ, తమ మతపరమైన సంప్రదాయాలను కాపాడుకుంటూ జీవించడమే ఇక్కడి ప్రత్యేకత. అయితే, గత కొన్నేళ్లుగా దేశవ్యాప్తంగా సాగుతున్న కొన్ని పరిణామాలు ఈ చారిత్రాత్మక సామరస్యాన్ని, మతసహన భావనను తీవ్రమైన ప్రశ్నార్థకంలోకి నెట్టేస్తున్నాయి.

ఇటీవలి కాలంలో దేశంలోని పలు ప్రాంతాల్లో మసీదులు, మదరసాలు, ఈద్గాలు, దర్గాలపై జరుగుతున్న ఏకపక్ష కూల్చివేతలు సరికొత్త వివాదాలకు, ఆందోళనలకు కేంద్రబిందువుగా మారాయి. గత ఒకటిన్నర నెలల కాలంలోనే వివిధ రాష్ట్రాల్లో ముస్లిం మతపరమైన స్థలాలను బుల్డోజర్ల సాయంతో నేలమట్టం చేసిన తీరు దేశంలోనే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలోనూ తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ సంఘటనలు భారతదేశంలో మత స్వేచ్ఛ, మైనారిటీల రాజ్యాంగ హక్కులు, చారిత్రక వారసత్వ పరిరక్షణల ప్రస్తుత దుస్థితిని కళ్ళకు కడుతున్నాయి. పరిపాలనా యంత్రాంగం చెబుతున్నట్లు ఇవి కేవలం 'ఆక్రమణల తొలగింపు' చర్యలేనా, లేక దీని వెనుక నిర్దిష్ట సామాజిక, రాజకీయ ఎజెండాలు దాగి ఉన్నాయా అనే అనుమానాలు బలపడుతున్నాయి.

## చట్టబద్ధతను కాలరాస్తున్న బుల్డోజర్ సంస్కృతి

ఈ కూల్చివేత చర్యలలో అత్యంత ఆందోళనకరమైన అంశం ఏమిటంటే.. శతాబ్దాల నాటి మతపరమైన నిర్మాణాలను కూల్చే ముందు స్థానిక ప్రజలకు గానీ, ఆయా యాజమాన్యాలకు గానీ తమ చట్టపరమైన పక్షాన్ని నిరూపించుకోవడానికి లేదా న్యాయస్థానాలను ఆశ్రయించడానికి కనీస సమయం ఇవ్వక పోవడం. అనేక సందర్భాల్లో ప్రాథమిక నోటీసులు కూడా జారీ చేయలేదని, సహజ న్యాయ సూత్రాలను, చట్టపరమైన నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కారని మానవ హక్కుల కార్యకర్తలు, సామాజిక సంస్థలు ఆధారాలతో సహా ఆరోపిస్తున్నాయి. ఒకవేళ ఈ ఆరోపణలే నిజమైతే, ఇది కేవలం ఒక వర్గానికి సంబంధించిన మతపరమైన సమస్య మాత్రమే కాదు; దేశంలో చట్టబద్ధమైన పాలన (Rule of Law), పౌర హక్కుల మనుగడకే ప్రమాదకరమైన హెచ్చరిక.

రాజధాని ఢిల్లీలోని మంగోల్‌పురి ప్రాంతంలో శతాబ్దాల నాటి పురాతన దర్గాను అకస్మాత్తుగా కూల్చివేయడంతో ఈ వివాదం మరింత ముదిరింది. తరతరాలుగా స్థానికులకు అపారమైన నమ్మక కేంద్రంగా, ఆ ప్రాంత సాంస్కృతిక చరిత్రలో భాగమైన

ఒక కట్టడాన్ని క్షణాల్లో నేలమట్టం చేయడం స్థానికుల్లో తీవ్ర అసంతృప్తికి, సామాజిక మాధ్యమాల్లో పెను వ్యతిరేకతకు దారి తీసింది. అదే సమయంలో ఢిల్లీలోనే నిర్మాణంలో ఉన్న మరో మదరసా గోడను పడగొట్టడం ఈ అగ్నికి మరింత ఆజ్యం పోసింది. ఈ బుల్డోజర్ సంస్కృతి కేవలం ఢిల్లీకే పరిమితం కాలేదు. హర్యానా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో కూడా ఒకదాని తర్వాత ఒకటిగా ఇలాంటి సంఘటనలే పునరావృతమవుతున్నాయి. దశాబ్దాలు, శతాబ్దాల చరిత్ర కలిగిన నిర్మాణాలను కూల్చివేసినప్పుడు, అది కేవలం ఇటుకలు, రాళ్లతో కూడిన కట్టడాల ధ్వంసం కాబోదు; ఆ ప్రాంత పౌరుల సామూహిక జ్ఞాపకాలను, సాంస్కృతిక గుర్తింపును, మతపరమైన భావోద్వేగాలను నిలువునా గాయపరచడమే అవుతుంది. ఒక నిర్మాణం చట్టపరమైన స్థితి వివాదాస్పదంగా ఉన్నప్పుడు, దానిపై తుది నిర్ణయం తీసుకోవాల్సింది కోర్టులు, న్యాయ చట్టాలే గానీ.. అధికార బలం చూపే బుల్డోజర్లు కాదు. ప్రతిపక్షానికి తమ వాదనను వినిపించుకునే అవకాశం కల్పించడమే ప్రజాస్వామ్య చట్టం ప్రాథమిక సూత్రం.

## ఆక్రమణల సాకు.. అసలు లక్ష్యం వేరా?

అయితే, ప్రభుత్వాలు మరియు పరిపాలనా యంత్రాంగం మాత్రం ప్రజా ప్రయోజన ప్రాజెక్టుల కోసమో లేదా రహదారుల విస్తరణ కోసమో ఆక్రమణలను తొలగించడం అనివార్యమంటూ తమ చర్యలను సమర్థించుకుంటున్నాయి. ఈ వైరుధ్యమే ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణం. ఒకవైపు యంత్రాంగం దీనిని కేవలం చట్టపరమైన అవసరంగా చిత్రీకరిస్తుంటే, మరోవైపు బాధితులు, మానవ హక్కుల సంస్థలు దీనిని ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని సాగిస్తున్న వివక్షాపూరిత చర్యగా వేలెత్తి చూపుతున్నాయి. ఇక్కడే ఒక మౌలికమైన ప్రశ్న తలెత్తుతోంది- చట్టం అందరికీ సమానమైనప్పుడు, కూల్చివేత చర్యలకు ఎంచుకునే స్థలాల విషయంలో ఒకే రకమైన ప్రామాణికత ఎందుకు ఉండటంలేదు? ఈ పక్షపాత వైఖరిపైనే ఇప్పుడు కోర్టుల్లో, ప్రజా బాహుళ్యంలో, అంతర్జాతీయ వేదికలపై తీవ్రమైన చర్చ నడుస్తోంది.

ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న కొన్ని పరిణామాలు ఈ వివాదాన్ని మరింత సున్నితంగా మార్చాయి. గత కొన్నేళ్లుగా ఆ రాష్ట్రం ''బుల్డోజర్ రాజకీయం'' అనే నయా ట్రెండ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ప్రభుత్వం దీనిని నేరగాళ్లపై తీసుకుంటున్న కఠిన చర్యగా ప్రచారం చేసుకుంటున్నప్పటికీ.. విమర్శకులు మాత్రం దీనిని నిర్దిష్ట రాజకీయ, సామాజిక సందేశాలను పంపడానికి, ఒక వర్గంలో భయాందోళనలు సృష్టించడానికి వాడుతున్నారని ఘాటుగా విమర్శిస్తున్నారు. ఈ ప్రక్రియలోకి మతపరమైన స్థలాలను లాగినప్పుడు, సమస్య విశ్వాసాలకు సంబంధించినదిగా మారి మరింత క్లిష్టంగా తయారవుతుంది. సాంస్కృతిక నగరమైన వారణాసిలో ఒక పురాతన మసీదును కూల్చివేయడం, మరో చారిత్రక మసీదుకు నోటీసులు ఇవ్వడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. భిన్నత్వానికి నిలువెత్తు రూపమైన వారణాసి లాంటి నగరంలో చారిత్రక కట్టడాల భవిష్యత్తు అనేది కేవలం స్థానిక సమస్య కాదు, అది జాతీయ స్థాయి అస్తిత్వ సమస్య.

## రాజ్యాంగ స్ఫూర్తికే ముప్పు

వాషింగ్టన్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలు అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు సైతం ఈ పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం. మతపరమైన స్థలాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నా.. అందులో పూర్తి పారదర్శకత, న్యాయపరమైన పర్యవేక్షణ, చట్ట నిబంధనల పాటింపు ఉండేలా చూడాలని అవి భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. పౌర హక్కుల గౌరవానికి, చట్టబద్ధమైన పాలనకు మధ్య సమతుల్యతను కాపాడుకోవడం ఏ ప్రజాస్వామ్య ప్రభుత్వానికైనా కనీస బాధ్యత.

రాజ్యాంగ కోణం నుండి విశ్లేషిస్తే, భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి మత స్వేచ్ఛకు స్పష్టమైన హామీ ఇస్తోంది. ఆర్టికల్ 25 ప్రకారం ప్రతి వ్యక్తికి తన మతాన్ని అవలంబించడానికి, ప్రచారం చేయడానికి, మతపరమైన ఆచారాలను నిర్వహించడానికి సంపూర్ణ హక్కు ఉంది. మన రాజ్యాంగం మూలస్తంభాలు లౌకికవాదం, సర్వమత సమానత్వంపై ఆధారపడి నిర్మితమయ్యాయి. అందువల్ల, ఒక మతపరమైన స్థలాన్ని కూల్చివేసినప్పుడు అది కేవలం ఒక భవనానికో, స్థలానికో సంబంధించిన వివాదం కాదు; అది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులపై, దేశ లౌకిక స్ఫూర్తిపై జరిగే దాడిగానే భావించాల్సి ఉంటుంది. ఇప్పటికైనా పాలకులు, న్యాయస్థానాలు స్పందించి ఈ బుల్డోజర్ సంస్కృతికి అడ్డుకట్ట వేయకపోతే, దేశం శతాబ్దాలుగా కాపాడుకుంటూ వస్తున్న సామాజిక సామరస్యం శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉంది.

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల సొపురాయి
గేటురాయి
వారపత్రిక




- డాక్టర్ సాజిద్ అబ్బాసీ

**ఈమాన్ అనగా కేవలం ఒక నమ్మకం మాత్రమే కాదు; అది మనిషి హృదయంలో, మేధస్సులో, అనుభూతులలో, ఆచరణలో అంతర్భాగమై, జీవన గమనమై మారే ఒక అచంచలమైన నిశ్చయం. అందుకే, ఖురాన్ మానవుడిని ప్రకృతిలోని సంకేతాల గురించి, సృష్టి గమనం గురించి ఆలోచించమని పదేపదే ప్రేరేపిస్తుంది. ఈ ప్రయాణంలో విశ్వాసం మూడు దశలను దాటుతుంది: ఇల్మ్ముల్ యఖీన్, ఐనుల్ యఖీన్, హక్కుల్ యఖీన్.**

### 1. ఇల్ముల్ యఖీన్ (ప్రమాణబద్ధమైన జ్ఞానంతో కలిగే విశ్వాసం)

ఇల్ముల్ యఖీన్ అంటే, సత్యమైన జ్ఞానం, తార్కిక ఆధారాలు, సృష్టికర్త ఇచ్చిన సందేశం ఆధారంగా కలిగే విశ్వాసం. ఖురాన్ ఇలా చెబుతుంది: "ఒకవేళ మీరు నిశ్చయ జ్ఞానంతో (ఇల్ముల్ యఖీన్) తెలిసి ఉంటే..." (సూరా తకాసుర్: 5).

ఇది కళ్లారా చూడకముందే, ఆధారాలను బట్టి కలిగే నమ్మకం. ఉదాహరణకు, నిప్పును చూడని వ్యక్తి కూడా, నిప్పు కాల్చుతుందన్న నమ్మదగిన సమాచారాన్ని అందుకున్నప్పుడు, ఆ ఆధారాల మీద నిప్పు ఉందనే నమ్మకాన్ని ఎలాగైతే పొందుతాడో, అలాగే మనం స్వర్గం, నరకం, పరలోకం, అల్లాహ్ ఉనికి వంటి అదృశ్య విషయాలను ఖురాన్ అందించిన తార్కిక ఆధారాల వల్ల నమ్ముతాము.

ఖురాన్ అల్లాహ్ వాక్కు అని, ముహమ్మద్ (స) ఆయన ప్రవక్త అని మనం మన మేధస్సుతో, విశ్లేషణతో, పరిశీలనతో నమ్ముతాము. మనం ఎంతగా ఖురాన్‌ను అర్థం చేసుకుని చింతన చేస్తామో, అంతగా మనలోని 'ఇల్ముల్ యఖీన్' బలపడుతుంది.

**మానవ మేధస్సు - పరీక్ష** : జంతువులకు, మనిషికి గల ముఖ్యమైన తేడా 'విచక్షణ'. జంతువులు కేవలం తమ ఇంద్రియాలకు తగిలే వాటినే గుర్తిస్తాయి. కానీ, మనిషి తన మేధస్సుతో సృష్టిలోని సంకేతాలను చూసి, సృష్టికర్తను గుర్తించగలడు. అల్లాహ్ పెట్టిన మొదటి పరీక్ష మన మేధస్సుకే. మనిషి తన జీవితాన్ని కేవలం ఇంద్రియ సుఖాలకే పరిమితం చేసుకుంటాడా? లేక "ఈ విశ్వాన్ని సృష్టించింది ఎవరు? ఎందుకు సృష్టించాడు?" అనే

పరమార్థం కోసం వెతుకుతాడా? అనేదే కీలకం. ఈ ప్రశ్నలకు సమాధానం వెతికేవాడు తన సృష్టికర్తను కచ్చితంగా దర్శించ గలడు. ఇదే ఒక స్పృహతో కూడిన విశ్వాసానికి నాంది.

## తార్కిక నిదర్శనం, విశ్వాసం: ఇల్ముల్ యఖీన్

నిజానికి, ఆధునిక విజ్ఞాన శాస్త్రం అంగీకరించే ఎన్నో సత్యాలు మన పంచేంద్రియాలకు నేరుగా గోచరించేవి కావు. కేవలం వాటి ఉనికిని సూచించే ఆనవాళ్లు, పరిణామక్రమం, తార్కిక ఆధారాల (Inference) ద్వారానే మనం వాటిని విశ్వసిస్తాము. ఉదాహరణకు, ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్లను ఎవరూ కళ్లారా చూడలేదు; కానీ వాటి ప్రభావాలను, విద్యుత్ ప్రవాహాన్ని, అణు ప్రయోగాల ఫలితాలను చూసి వాటి ఉనికిని అంగీకరిస్తున్నాము. కాంతికి మూలకణాలైన 'ప్రోటాన్లు' మనకు కనిపించవు, కానీ వాటి వల్ల వెలువడే కాంతి ద్వారానే ప్రపంచాన్ని చూస్తున్నాము. 'గురుత్వాకర్షణ' (Gravity) కంటికి కనిపించదు, కానీ గ్రహ గతులు, వస్తువుల పతనం ద్వారా దాని ఉనికిని నిరూపించు కుంటున్నాము.

ఈ విశ్వంలో ఏదీ కంటికి కనిపిస్తేనే నిజమని అనడానికి వీలు లేదు. ఒకవేళ 'కనిపిస్తేనే నమ్ముతాను' అనే సిద్ధాంతం నిజమైతే, మనిషి తన సొంత 'చైతన్యం' (Consciousness) లేదా 'సంకల్పాన్ని' కూడా కాదనాల్సి వస్తుంది. ఎందుకంటే మనం మన ఆలోచనలను చూడలేము, కానీ అవి ఉన్నాయని నమ్ముతాము.

**సృష్టికర్త - ఒక తార్కిక సత్యం :** సృష్టిని గమనిస్తే, ప్రతి ప్రభావానికి (Effect) ఒక మూల కారణం (Cause) ఉంటుంది. ఒక అద్భుతమైన గ్రంథం ఉంటే దానికి రచయిత ఉంటాడు, ఒక సుందర భవనం ఉంటే దానికి వాస్తుశిల్పి ఉంటాడు. అలాగే, ఈ విశ్వం ఒక క్రమశిక్షణతో, అనంతమైన నియమాలతో నడు స్తోందంటే, దాని వెనుక ఒక అత్యున్నత మేధస్సు గల 'సృష్టికర్త' (Creator) ఉండి తీరాలి. ఇదే ఇల్ముల్ యఖీన్-అంటే, సృష్టిని పరిశీలించి సృష్టికర్త ఉనికిని తార్కికంగా గుర్తించడం.

ఖురాన్ ఇలా చెబుతోంది: "వారు తమ పరిమిత జ్ఞానంతో ఆయనను గ్రహించలేరు." (సూరా తాహా: 110). మానవుడు ఇప్పటికీ తాను నివసిస్తున్న ఈ అనంత విశ్వాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాడు. 93 బిలియన్ కాంతి సంవత్సరాల విస్తీర్ణ మున్న దృశ్య విశ్వాన్నే ఇంకా పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోలేని మానవుడు, ఆ విశ్వాన్నే సృష్టించిన సర్వశక్తిమంతుడిని కళ్లతో చూసి నమ్ముతానని అనడం అశాస్త్రీయం, అహేతుకం.

**జ్ఞాన మార్గం- ఇల్ముల్ యఖీన్ :** కళ్లతో చూసి నమ్మడం కేవలం జంతువుల సహజ లక్షణం. కానీ, దేవుడు మానవుడికి 'మేధస్సు'ను ఇచ్చాడు, ఇంద్రియాలకు అందనటువంటి అదృశ్య సత్యాలను తార్కిక విశ్లేషణతో గ్రహించడానికే. హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) నక్షత్రాలు, చంద్రుడు, సూర్యుడిని గమనించి, అవి ఒక నియమానికి బద్ధమై ఉండటం చూసి, వాటిని సృష్టించిన శక్తివంతుడైన దేవుడే నా ఆరాధ్యుడని గుర్తించారు.

అందుకే, సృష్టిలోని సంకేతాలను తర్కంతో చదివి, ఆ సృష్టికర్త ఉనికిని నమ్మడమే 'ఇల్ముల్ యఖీన్'. ఇది విశ్వాసం యొక్క ప్రథమ సోపానం. ఇంద్రియ గోచరమైన ప్రపంచం నుండి, అదృశ్య సత్యాల వైపు సాగే ఈ ప్రయాణమే మానవ మేధస్సుకు అత్యున్నత గౌరవం.

## 2. ఐనుల్ యఖీన్ (సాక్షాత్కారంతో కలిగే నమ్మకం)

'ఐనుల్ యఖీన్' అంటే, ఒక సత్యాన్ని కేవలం విజ్ఞానపరంగా తెలుసుకోవడం (ఇల్ముల్ యఖీన్) మాత్రమే కాకుండా, దానిని తన కళ్ళతో సాక్షాత్కరించుకోవడం ద్వారా కలిగే అచంచలమైన విశ్వాసం. హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) సైద్ధాంతిక జ్ఞానాన్ని దాటి, ఆ విశ్వాసానికి పరాకాష్ట అయిన 'సాక్షాత్కార' స్థితిని కోరుకున్నారు. దీనిని ఖురాన్ ఇలా వివరిస్తుంది:

"మరొక సంఘటనను కూడ దృష్టిలో ఉంచుకో. ఇబ్రాహీము ఇలా అడిగాడు : "ఓ నా ప్రభూ! నీవు మృతులను ఏవిధంగా బ్రతికిస్తావో నాకు చూపించు." అల్లాహ్ "నీకు విశ్వాసం లేదా?" అని అడిగాడు. ఇబ్రాహీము వినయంగా ఇలా అన్నాడు : "నాకు విశ్వాసం అయితే ఉంది. కాని మనస్సును తృప్తి పరచటం కోసం అడుగుతున్నాను." అప్పుడు అల్లాహ్ చెప్పాడు : "సరే, మంచిది, నాలుగు పక్షులను తీసుకో. వాటిని బాగా మచ్చిక చేసుకో తరువాత ఒక్కొక్కదాని భాగాన్ని ఒక్కొక్క కొండపై పెట్టి రా. మళ్ళీ వాటిని రమ్మని పిలువు. అవి నీ వద్దకు పరుగెత్తుకుంటూ వస్తాయి. అల్లాహ్ సర్వశక్తిమంతుడూ సర్వజ్ఞుడూ అని బాగా జ్ఞాపకం ఉంచుకో." (సూరా బఖరా: 260).

ఈ సంఘటన 'ఇల్ముల్ యఖీన్' నుండి 'ఐనుల్ యఖీన్' వైపు సాగిన ఆధ్యాత్మిక ప్రయాణానికి నిదర్శనం. ఖురాన్ మరొక చోట ఇలా హెచ్చరిస్తుంది: " మీరు పూర్తి నమ్మకంతో దాన్ని చూస్తారు." (సూరా తకాసుర్: 7). దీని అంతరార్థం ఏమిటంటే, మరణానంతర జీవితంలో నరకాగ్నిని చూసే దుస్థితి రాకముందే, ఈ లోకంలోనే దైవిక జ్ఞానంతో దాని ఉనికిని గుర్తించి, ఆ అగ్ని నుండి రక్షణ పొందేలా సన్నద్ధం కావాలి. కంటితో చూసిన సత్యాన్ని నిరాకరించడం అసాధ్యం, కానీ ఆ దశకు చేరుకున్నాక లభించే జ్ఞానం వల్ల ప్రయోజనం ఉండదు. కాబట్టి, సజీవంగా ఉన్నప్పుడే సత్యాన్ని గ్రహించడం వివేకం.

## సాక్షాత్కారానికి నిదర్శనాలు:

**ప్రవక్త ముహమ్మద్ (స) :** మేరాజ్ రాత్రి, అల్లాహ్ తన ప్రవక్తకు స్వర్గం, నరకం, అదృశ్య ప్రపంచపు వాస్తవాలను కళ్ళకు కట్టినట్లు చూపించాడు. ఇది 'ఐనుల్ యఖీన్'కు పరాకాష్ట. ఖురాన్ ఇలా అంటుంది: "నిశ్చయంగా ఆయన తన ప్రభువు అద్భుతమైన సంకేతాలను కళ్ళారా వీక్షించారు" (సూరా నజ్మ్: 18).

**బనీ ఇస్రాయీల్ :** సముద్రం రెండుగా చీలిపోవడం, ఫిరౌన్ సైన్యం జలసమాధి కావడం వంటివి బనీ ఇస్రాయీల్ ప్రజలు స్వయంగా వీక్షించారు. ఇది అల్లాహ్ సహాయంపై వారికి కలిగిన 'ఐనుల్ యఖీన్'.

ప్రవక్తలు అటువంటి దివ్య సంకేతాలను వీక్షించి, నిశ్చయస్థితిని పొందుతారు. అట్టి దివ్యదర్శనం పొందిన వారు విశ్వాసంలో అత్యున్నత శిఖరాలపై నిలబడి, లోకానికి సత్యమార్గం చూపుతారు. ప్రజలు సత్యాన్ని తిరస్కరించి, వినాశనానికి గురి కాకూడదనే అపారమైన తపనతో, ఎంతో దయార్ద్ర హృదయంతో వారు చేసే ప్రబోధం అత్యంత శక్తివంతంగా ఉంటుంది. ఆ ప్రబోధంలోనే వారి 'ఐనుల్ యఖీన్' ప్రతిబింబం కనిపిస్తుంది.

## 3. హక్కుల్ యఖీన్ (అనుభూతితో సాక్షాత్కరించే పరమ సత్యం)

'హక్కుల్ యఖీన్' అనేది విశ్వాస యాత్రలో చివరి మెట్టు, అత్యున్నత శిఖరం. ఒక సత్యం కేవలం జ్ఞానంగా (ఇల్ముల్ యఖీన్) లేదా కేవలం దృశ్య సాక్షాత్కారంగా (ఐనుల్ యఖీన్) మాత్రమే మిగిలిపోకుండా, మనిషి తన సొంత అనుభవంలో, తన ఆత్మలో ఆ సత్యాన్ని విలీనం చేసుకున్న స్థితిని ఇది సూచిస్తుంది. ఖురాన్ దీనిని ఇలా పేర్కొంది: "ఇదంతా తిరుగులేని సత్యం." (సూరా వాకియా: 95).

## ఈ దశను అర్థం చేసుకోవడానికి ఒక ఉపమానం:

అగ్ని గురించి వినడం లేదా చదవడం ద్వారా దాని ఉనికిని నమ్మడం- ఇల్ముల్ యఖీన్.

అగ్నిని కళ్ళారా ప్రత్యక్షంగా చూడటం- ఐనుల్ యఖీన్.

ఆ అగ్ని తాపాన్ని (వేడిని) మనశ్శరీరాలతో ప్రత్యక్షంగా అనుభవించడం- హక్కుల్ యఖీన్.

## హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) జీవితంలో ఈ మూడు సోపానాలు:

1. విశ్వ గమనాన్ని గమనించి, సృష్టికర్త ఉనికిని మేధస్సుతో గ్రహించడం ద్వారా ఆయనకు 'ఇల్ముల్ యఖీన్' కలిగింది.

2. అల్లాహ్ ఆజ్ఞ మేరకు పక్షులను పునరుజ్జీవింపజేసే అద్భుతాన్ని కళ్ళారా చూసినప్పుడు ఆయనకు 'ఐనుల్ యఖీన్' సిద్ధించింది.

3. నమ్రూద్ ఆయనను నిప్పులో పడేసినప్పుడు, "ఓ అగ్నీ! ఇబ్రహీంపై చల్లబడు, క్షేమకరంగా మారు" అనే దైవాదేశం ద్వారా, మండుతున్న నిప్పు ఆయనకు పూలబాటగా మారడాన్ని అనుభవపూర్వకంగా దర్శించారు. ఆ దైవిక శక్తిని ఆయన అనుభవించారు, ఇదే 'హక్కుల్ యఖీన్'.

తన కుమారుడు ఇస్మాయిల్ (అలైహిస్సలాం)ను బలి ఇవ్వడానికి సిద్ధపడి, ఆ కత్తిని మెడపై ఉంచిన క్షణం, వారు పొందిన దైవిక అనుభవం విశ్వాసానికి పరాకాష్ట. ఆ స్థితిని ఖురాన్ ఇలా వర్ణిస్తుంది: "ఇబ్రాహీమ్! నీవు కలను నిజం చేసి చూపించావు. " (సూరా సాఫ్ఫాత్: 103-105). ఇది ఒక తండ్రికి, తనయుడికి దైవంపై కలిగిన గాఢమైన, అనుభవపూర్వకమైన నమ్మకం.

## ఇతర చారిత్రక నిదర్శనాలు:

సౌర్ గుహ (గారె సూర్) : శత్రువులు గుహ ముంగిట ఉన్నప్పుడు, హజ్రత్ అబూబక్ర్ (ర) ఆందోళన చెందగా, ప్రవక్త (స) అన్న


### చందాదారులకు విజ్ఞప్తి

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

మాటలు: "విచారించకు, అల్లాహ్ మనతో ఉన్నాడు" (సూరా తౌబా: 40). ఆ క్లిష్ట పరిస్థితుల్లో అల్లాహ్ సాన్నిధ్యాన్ని వారు అనుభవపూర్వకంగా గ్రహించారు. ఇది 'హక్కుల్ యఖీన్'కు నిదర్శనం.

బద్ర్ యుద్ధం : కేవలం 313 మంది విశ్వాసులకు వెయ్యి మందిని ఎదుర్కొనే ధైర్యం దైవ సహాయం వల్లనే లభించింది. ఆ యుద్ధంలో వారు పొందిన విజయం అల్లాహ్ యొక్క వాగ్దానాన్ని వారి అనుభవంలోకి తెచ్చింది. "సహాయం కేవలం అల్లాహ్ నుండే వస్తుంది" (సూరా అన్ఫాల్: 10) అన్న సత్యాన్ని వారు తమ అనుభూతితో దర్శించారు.

## ఖురాన్ - విశ్వాస పరిణామక్రమం: ఇల్ముల్ యఖీన్ నుండి హక్కుల్ యఖీన్ వరకు

ఖురాన్ ఒక అద్భుత గ్రంథం. అది తన పాఠకుడిని విశ్వాసం యొక్క అత్యున్నత సోపానాలకు చేరుస్తుంది. ఖురాన్ అనుసరించే ఆ ఆధ్యాత్మిక ప్రయాణం ఇక్కడ చూడవచ్చు:

**1. ఇల్ముల్ యఖీన్ (మేధోపరమైన నమ్మకం)** : ఖురాన్ తన సూచనల ద్వారా, వాదనా పటిమతో విశ్వాసి హృదయంలో 'ఇల్ముల్ యఖీన్'ను కలిగిస్తుంది. అల్లాహ్ ఏకత్వం (తౌహీద్), ప్రవక్తల సందేశం (రిసాలత్), పరలోక జీవితం (ఆఖిరత్) గురించి ఖురాన్ చూపే అఖండ సాక్ష్యాలు ఏ మేధావినైనా ఆశ్చర్య చకితుడిని చేస్తాయి. ఆకాశం, భూమి, సూర్యచంద్రుల గమనం, మానవ సృష్టిలోని రహస్యాలు, ప్రకృతిలోని ప్రతి అణువులో ఉన్న అద్భుతమైన క్రమశిక్షణను చూపిస్తూ... ఖురాన్ మానవ మేధస్సును సంతృప్తి పరుస్తుంది. బుద్ధి ఎప్పుడైతే సత్యానికి లోబడి పోతుందో, అప్పుడే 'ఇల్ముల్ యఖీన్' ఆవిర్భవిస్తుంది.

**2. ఐనుల్ యఖీన్ (దృశ్యరూప సాక్షాత్కారం)** : ఖురాన్ కేవలం సిద్ధాంతాలను చెప్పదు; అది స్వర్గ నరకాల దృశ్యాలను, పరలోక వాస్తవాలను పాఠకుడి కళ్ళ ముందు సాక్షాత్కరింపజేస్తుంది. ఆ వర్ణనలు చదువుతున్నప్పుడు, పాఠకుడు ఆ సన్నివేశాలను ప్రత్యక్షంగా చూస్తున్నాడన్న అనుభూతిని పొందుతాడు. ఈ పారవశ్యమే అతనిలోని 'ఐనుల్ యఖీన్'ను మేల్కొల్పుతుంది.

**3. హక్కుల్ యఖీన్ (అనుభవపూర్వక సత్యం)** : ఖురాన్ బోధించిన మార్గంలో అడుగుపెట్టి, నిబద్ధతతో ప్రార్థిస్తూ (దువా), ఆరాధనల్లో మునిగిపోతూ, పాపాలకు దూరంగా జీవించే దాసుడికి అల్లాహ్ తన సాన్నిధ్యాన్ని రుచి చూపిస్తాడు. జీవితంలోని క్లిష్ట పరిస్థితుల్లో అల్లాహ్ అందించే అండను, ఆపదల్లో ఆయన చూపే కరుణను, ఆత్మీయ ప్రశాంతతను ఆ వ్యక్తి స్వయంగా అనుభవిస్తాడు. ఈ అనుభవం సిద్ధాంతాన్ని దాటి ఒక జీవన సత్యంగా మారుతుంది. విశ్వాసం ఒక 'అనుభవంగా' మారడమే 'హక్కుల్ యఖీన్'.

## మరణం - సత్య సాక్షాత్కారం, విశ్వాస పరిపూర్ణత

మరణం అనేది మానవ జీవితంలో ఎదురయ్యే అత్యంత వాస్తవిక మైన సత్యం. ఇది మనకు అదృశ్య ప్రపంచం (గైబ్) పట్ల అచంచలమైన నమ్మకాన్ని కలిగిస్తుంది. ప్రాణం పోయే ఆ క్షణంలో, కంటికి కనిపించని తెరలన్నీ తొలగిపోతాయి. మనిషి 'ఆలమే గైబ్' (అదృశ్య లోకం)లోకి ప్రవేశించి, ముందుగా మరణ దూతను (మలకల్ మౌత్) దర్శిస్తాడు. అప్పటి వరకు రహస్యంగా ఉన్న పరలోక సత్యాలన్నీ ఒక్కొక్కటిగా అతని కళ్ళ ముందు ఆవిష్కృతమవుతాయి.

**ఖురాన్ అందించే హెచ్చరిక** : ఖురాన్ మానవుడికి ఒక ముఖ్యమైన పిలుపునిస్తుంది: మరణం అనే 'ఐనుల్ యఖీన్' (కళ్ళారా నిజం చూసే క్షణం) రాకముందే, ఈ లోకంలోనే దైవ జ్ఞానం (ఇల్ముల్ యఖీన్) సంపాదించుకోమని చెబుతుంది. ఆ జ్ఞానంతో భయభక్తులతో కూడిన జీవితాన్ని గడిపి, ఈ పరీక్షా క్షేత్రంలో విజేతగా నిలిచి మరణం అనే ద్వారం దాటాలి. అలా సిద్ధపడిన వారికి, ఆ తర్వాత ఎదురయ్యే ప్రతి మజిలీ తెలిసి నట్లుగా, పరిచయం ఉన్నట్లుగా ఉంటుంది; అక్కడ వారికి ఎటువంటి దిగ్భ్రమ లేదా ఆశ్చర్యం కలగదు.

**మరణమే పరమ సత్యం** : ఖురాన్ ఇలా అంటుంది: "తప్పకుండా వచ్చే చివరి గడియవరకూ నీ ప్రభువు దాస్యం చేస్తూ వుండు." (సూరా హిజ్ర్: 99).

ఈ వచనంలో మరణాన్ని 'యఖీన్' అని ఎందుకు పిలిచారు? ఎందుకంటే, మరణం అనేది మనిషి తిరస్కరించలేని, ఖచ్చితంగా సంభవించే ఒక అచంచలమైన సత్యం. బ్రతికి ఉన్నంత కాలం జీవితంపై ఎన్నో అస్పష్టతలు ఉంటాయి---ఎప్పుడు, ఎక్కడ మన జీవిత సంధ్య ముగుస్తుందో ఎవరూ ఊహించలేరు. కానీ, మరణం మాత్రం ఖచ్చితం; దానిని ఎవరూ కాదనలేరు.

ప్రవక్త ముహమ్మద్ (స) వారి మహోన్నత సహచరుల (సహాబాల) హృదయాలలో విశ్వాసం (ఈమాన్), నమ్మకం (యఖీన్) ఎంతటి అత్యున్నత శిఖరాలకు చేరుకున్నాయో ఈ చారిత్రక ఘట్టాలు వివరిస్తాయి:

**హజ్రత్ బిలాల్ (ర)** : మక్కా నగరంలో మండుతున్న ఎండలో, కాలుతున్న ఇసుకపై వారిని పడుకోబెట్టి, గుండెలపై బరువైన బండరాళ్లను ఉంచేవారు. అంతటి కఠినమైన, అమానుషమైన పరిస్థితుల్లో కూడా వారి పెదవులపై వెలువడిన ఒకే ఒక్క పదం: "అహద్, అహద్" (అల్లాహ్ ఒక్కడే). ఇది కేవలం మేధోపరమైన విశ్వాసం (ఇల్ముల్ యఖీన్) కాదు; ఇది వారి ఆత్మ అంతర్భాగం లోకి ఇంకిపోయిన అచంచలమైన నమ్మకం. వాస్తవానికి ఇదే అత్యున్నతమైన 'హక్కుల్ యఖీన్'.

**హజ్రత్ ఖుబైబ్ బిన్ అదీ (ర)** : వారిని ఉరితీస్తున్న క్షణంలో, శత్రువులు వారిని ఇలా అడిగారు: "నీ స్థానంలో ముహమ్మద్ (స) ఉంటే బాగుండని నువ్వు కోరుకుంటున్నావా?" దానికి వారు ఏమాత్రం తడుముకోకుండా ఎంతో గంభీరంగా ఇలా బదులిచ్చారు: "అల్లాహ్ సాక్షిగా! ప్రవక్త (స) వారి పాదానికి ఒక చిన్న ముల్లు గుచ్చుకున్నా సరే నేను సహించలేను, అలాంటిది నేను నా ఇంట్లో సురక్షితంగా ప్రాణాలు కాపాడుకుని కూర్చోవాలని ఎలా కోరుకుంటాను!" ప్రవక్త (స) పట్ల ఇంతటి అపారమైన ప్రేమ కేవలం 'హక్కుల్ యఖీన్' ఉంటేనే సాధ్యమవుతుంది.

**హజ్రత్ సుమయ్యా (ర)** : వీరు ఇస్లాం చరిత్రలో మొట్టమొదటి అమరవీరురాలు. అబుజహల్ ఆమెను ఎన్నో దారుణమైన హింసలకు గురిచేశాడు, కానీ ఆమె తన విశ్వాసం నుండి అంగుళం కూడా వెనక్కి తగ్గలేదు. ఇది విశ్వాసంలో ఎంతటి ఉన్నతమైన మజిలీ అంటే, పరలోక సత్యం ముందు ఈ లోకపు కష్టాలు, హింసలు అత్యంత అల్పంగా మరియు తుచ్ఛంగా అనిపించే అద్భుతమైన స్థితి.

## సహబా ఈమాన్ : ఇల్ముల్ యఖీన్ నుండి హక్కుల్ యఖీన్ వరకు ప్రయాణం

సహబా విశ్వాసం అనేది కేవలం సిద్ధాంతాలకు పరిమితం కాలేదు; అది వారి జీవితాలనే మార్చివేసే ఒక శక్తివంతమైన అనుభూతి.

**హజ్రత్ ఉమర్ (ర) - ఆత్మసాక్షాత్కారం** : హజ్రత్ ఉమర్ (ర) గారి ఈమాన్ అత్యంత సున్నితమైనది మరియు గంభీరమైనది. ఖురాన్‌లోని ఆయత్‌లను విన్నప్పుడు, ఆ దైవిక వాక్కుల లోతును వారు తమ ఆత్మతో అనుభవించేవారు. ఒకసారి సూరా తూర్‌లోని "నిశ్చయంగా, నీ ప్రభువు శిక్షావిధి జరిగి తీరుతుంది" అనే ఆయత్ విన్నప్పుడు, ఆ దైవిక భయంతో వారు అనారోగ్యం పాలయ్యారు. ఇది కేవలం మాటలను వినడం కాదు, ఆ వాక్కులోని సత్యాన్ని తమ ఆత్మలో అనుభవించడం (హక్కుల్ యఖీన్).

**సహబా విశ్వాసపు అసలైన రూపం** : సహబా ఈమాన్ కేవలం జ్ఞానంతో మొదలై, ఆచరణాత్మకమైన 'హక్కుల్ యఖీన్' వరకు ప్రయాణించేది:

స్వర్గం ప్రస్తావన వస్తే, వారు దాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నట్లుగా పులకించిపోయేవారు.

నరకపు హెచ్చరికను వింటే వారి శరీరం వణికేది.

దైవ వాగ్దానాలు: అల్లాహ్ ఇచ్చిన వాగ్దానాలను మనం సూర్యుడిని చూసినంత స్పష్టంగా వారు నమ్మేవారు.

హక్కుల్ యఖీన్ - జీవన విధానం: నిజమైన 'హక్కుల్ యఖీన్' అంటే ఏమిటి? అది కేవలం హృదయంలో ఉండే భావన కాదు. అది మనిషి ప్రవర్తన, నైతికత, కృతజ్ఞత, త్యాగనిరతి (ఈసార్), ఓర్పు (సబర్), అల్లాహ్ పై పరిపూర్ణ భరోసా (తవక్కుల్) ద్వారా బయటపడే ఒక జీవన సౌందర్యం. సహబా ప్రతి అడుగు, ప్రతి మాటలో వారి 'హక్కుల్ యఖీన్' ప్రతిబింబించేది. అందుకే వారి జీవితాలు మనకు ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తాయి.

## ఖురాన్ - విశ్వాస పరిణామం: జ్ఞానం నుండి అనుభూతి వరకు

ఖురాన్ అల్లాహ్ వాక్కు అనడానికి, దాని ప్రభావమే అతిపెద్ద నిదర్శనం. ఆ దివ్య గ్రంథం తన పాఠకుడిని మూడు దశల ద్వారా విశ్వాస పరిపూర్ణత వైపు నడిపిస్తుంది:

**1. ఇల్ముల్ యఖీన్ (జ్ఞానపు పునాది)** : ఖురాన్ పఠనం ద్వారా పాఠకుడి హృదయంలో ఒక దృఢమైన మేధోపరమైన నిశ్చయం కలుగుతుంది. అల్లాహ్ ఏకత్వం, ప్రవక్తల మార్గం మరియు పరలోక సత్యాల పట్ల అది అందించే ఆధారాలు మనిషి బుద్ధిని సంతృప్తి పరిచి, సత్యాన్ని గ్రహించేలా చేస్తాయి.

**2. ఐనుల్ యఖీన్ (దృశ్యరూప సాక్షాత్కారం)** : మరణం, బర్జఖ్ (మధ్యంతర కాలం), పునరుత్థానం, తీర్పు దినం, స్వర్గనరకాల దృశ్యాలను ఖురాన్ ఎంతటి స్పష్టతతో వర్ణిస్తుందంటే, పాఠకుడు వాటిని తన కళ్లతోనే చూస్తున్నాడన్న అనుభూతిని పొందుతాడు. ఈ దృశ్యమాన అనుభూతే మనిషిని ఐనుల్ యఖీన్ స్థాయికి చేరుస్తుంది.

**3. హక్కుల్ యఖీన్ (అనుభవపూర్వక సత్యం)** : ఖురాన్ బోధనలను ఆచరిస్తున్నప్పుడు, సహనం, కృతజ్ఞత, అల్లాహ్‌పై భరోసా (తవక్కుల్), నిరంతర సేవలో మనిషి గడిపినప్పుడు, అతనికి దైవసహాయం ఒక అనుభవంగా మారుతుంది. ప్రతి పరీక్షా మజిలీ, ప్రతి పుణ్యకార్యం అతడిని మరింత ఉన్నతమైన ఆధ్యాత్మిక స్థితికి చేరుస్తుంది.

**ప్రార్థన, పరీక్ష - అనుభవాల నిలయం** : ఒక విశ్వాసి కష్టాల్లో ఉండి అల్లాహ్‌ను వేడుకున్నప్పుడు, ఆ ప్రార్థన ఫలించి ఉపశమనం లభిస్తే అది అతనికి అల్లాహ్ సాన్నిధ్యాన్ని రుచి చూపిస్తుంది. ఒకవేళ ఆ ప్రార్థన కోరినట్లుగా నెరవేరకపోయినా, అల్లాహ్ ప్రసాదించే మానసిక ప్రశాంతత ఆ దైవానికి మరింత దగ్గర చేస్తుంది. అప్పుడు అతనికి వ్యాధి, బాధలు కూడా పరలోక ప్రయాణానికి సోపానాలుగా కనిపిస్తాయి.

నేడు గాజాలోని ముస్లింలు అనుభవిస్తున్న కఠిన పరిస్థితులను గమనించండి. వారు ఇహలోకపు బాధల్లో ఉన్నప్పటికీ, వారి మనోనేత్రాలకు పరలోకపు నిత్య సౌఖ్యాలు కనిపిస్తూ ఉంటాయి. ఆ నిశ్చయం (ఐనుల్ యఖీన్) వల్లే వారు ఆ బాధలను కూడా ఆనందంగా భరిస్తున్నారు. వారు స్వర్గపు అంచులలో జీవిస్తున్నారు.

❖


# చరిత్ర అధ్యయనం మన బాధ్యత




**టిటాగడ్ (తేది: 26-06-2026)** గత చరిత్ర తెలియని వారు చారిత్రక తప్పిదాలను పునరావృతం చేస్తారు. అందుకే చరిత్ర పఠనం చేస్తూ, చరిత్ర గమనంలోని మంచి చెడులను నేర్చుకోవాలి. ప్రతి చారిత్రక తప్పిదమూ ఘోర పర్యవసానాలకు దారితీస్తుందనే ఎరుక మన ప్రస్తుత ప్రవర్తనను రుజుమార్గంలో పెడుతుంది. అందుకే చరిత్ర అధ్యయనం ఒక చారిత్రక బాధ్యత. ఆ బాధ్యతను చక్కగా నిర్వర్తిస్తున్నారు. గుంటూరుకు చెందిన **సయ్యద్ నశీర్ అహమ్మద్** గారు. విస్మృతికి గురైన ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను పరిశోధించి, ప్రజల ముందుకు తీసుకురావడానికి గత పాతికేళ్లుగా అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారాయన. ఈ క్రమంలో 26 గ్రంథాలూ, రెండు ఆల్బంలూ వెలువరించారు. ఈ గ్రంథాలను గ్రంథాలయాలకు, చరిత్ర ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, చరిత్ర పట్ల ఆసక్తిగల పాఠకులకు తమ వదాన్యుల కానుక అందిస్తున్నారు. పిల్లల కోసం స్వాతంత్ర్య సమరవీరుల ఫోటోలతో నేమ్ స్టిక్కర్లూ, ఫోటో ఎగ్జిబిషన్లూ, దేశవ్యాప్తంగా ప్రసంగాలూ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో 'ముందడుగు' -(విద్యా-సాహిత్య-సాంస్కృతిక వేదిక) ఆధ్వర్యంలో కోల్‌కతా, టిటాగడ్‌లోని బోడ తారకేశు గారి గృహం లోని పెద్ద హాలులో పలువురు శ్రోతలు ఆయన ప్రసంగాన్ని ఆసక్తి కరంగా విన్నారు. ఈ కార్యక్రమంలో వచ్చిన వారిలో విద్యార్థినీ, విద్యార్థులు ఎక్కువగా ఉండడం విశేషం. నశీర్ అహమ్మద్‌తో పాటు స్థానిక పెద్దలు ఎం. శివలింగం మాష్టారు, ఒట్టి భూతేశు గార్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'ముందడుగు' తరుపున అయిక బాలాజీ గారు సయ్యద్ నశీర్ అహమ్మద్ కృషిని కొనియాడుతూ, ఆయనను సభకు పరిచయం చేశారు. అనంతరం 'భారత స్వాతంత్ర్యో ద్యమం: సమైక్య పోరాటాల సమాహారం' అనే అంశం మీద నశీర్ అహమ్మద్ మాట్లాడారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం యోధులు చేసిన అపురూప త్యాగాల గురించి ఆయన ఒక్కొక్క సంఘటనను కథలు కథలుగా వివరిస్తుంటే హాజరైన విద్యార్థుల వదనాలు విస్మయంతో విప్పారాయి. గాంధీజీ ప్రాణాలను కాపాడిన బతక్‌మియా, అమరవీరులు రామ్‌ప్రసాద్ బిస్మిల్ - అష్ఫాఖుల్లా ఖాన్‌ల అపురూప మైన మతాతీత స్నేహం, ఝాన్సీ రాణికి సైనికులకు ఆయుధాలతో తోడువచ్చిన బండా నవాబ్ అలీ బహదూర్, సుభాష్ చంద్రబోస్‌కు 'నేతాజీ' అని పేరుపెట్టిన, 'జైహింద్' నినాదాన్నే సృజించిన తెలుగు బిడ్డడు ఆబిద్ హసన్ సఫ్రానీ, గాంధీజీ ఇచ్చిన ఒక్క పిలుపుతో తన ఆస్తినంతటినీ దేశవిముక్తి కోసం ధారబోసిన యూసుఫ్ సోభానీ, బ్రిటిష్ వైస్రాయ్ లార్డ్ మాయోని కాల్చిచంపిన అమరయోధులు షేర్ అలీ అఫ్రీదీ, ఇలా ఒక్కొక్క ముస్లిం స్వాతంత్ర్య సమర యోధుల అమరగాథలను విన్న శ్రోతలు ఆశ్చర్యానికి గురయ్యారు. చరిత్రలో దాగిన ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు కూడా తెలీని దశ నుంచి, ఒక నూతన అవగాహన ఏర్పరుచుకున్న సంతృప్తి సభికుల కళ్లలోనూ మెరిసింది. పనిగట్టుకు ప్రచారం చేసే విద్వేషాల చరిత్ర కాదు, జాతిమత ద్వేషాలకతీతంగా సాగిన సమైక్యపోరాటాల గాథలు వినిపిం చిడం, చరిత్రను విస్తారంగా ప్రచారం చేయడం నేటి అవసరం అని నశీర్ అహమ్మద్ ప్రసంగం రుజువుచేసింది. ఈనాటి ఆయన ప్రసంగం తమకు కొత్త విషయా లను తెలిపిందనీ, చరిత్ర పఠనం పట్ల ఆసక్తిని పెంచిందనీ విద్యార్థి నులు రస్మిత, హంస, కుసుమ, శ్రుతి తమ స్పందనగా తెలియ జేశారు. ప్రస్తుత స్థితిగతుల్ని అవగాహన చేసుకోవాలంటే చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలని చెబుతూ వెంకటరమణ మాష్టరు 'రెఫ్యూజీ' అనే కవితను వినిపించారు. ఇలాంటి కార్యక్రమం పెద్ద ఎత్తున జరగాల్సిందని శివలింగం మాస్టారు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం విచ్చల విడిగా అసత్యాలను ప్రచారం చేస్తున్న వాట్సాప్ గ్రూపుల విషయంలో చాలా అప్రమత్తంగా వుండాలని అయిక చంద్రశేఖర్‌రావు హెచ్చరించారు. చరిత్ర అంటే భయపడే దశ నుండి చరిత్ర ఎంతో ఆసక్తికరమైనదన్న విషయాన్ని తను గ్రహించినట్టు నిర్మల తెలిపారు. సయ్యద్ నశీర్ అహమ్మద్ జీవితంలోని 'పాల తల్లి' యశోదమ్మ గారి ఉ దాహరణనూ, తన వ్యక్తిగత జీవితంలోని ఉదాహరణలనూ చాలా భావోద్వేగంతో చెబుతూ అసలు 'హిందూ- ముస్లిం' విభేదాలకు అర్థం వుందా అంటూ అయికా బాలాజీ ప్రశ్నిం చారు. అండమాన్ జైలుకు ఆదిలో వెళ్లిన ఖైదీల్లో ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులే అధికమన్న సంగతినీ, దాని వెనుక కారణాన్నీ గమనించాలని బాలాజీ కోరారు. ఈ మొత్తం సభ నిర్వహణలో అవిశ్రాంతంగా కృషిచేసిన బోడ తారకేశు మాట్లాడుతూ ఈ కార్య క్రమం విజయవంతమైనందుకూ, మరీ ముఖ్యంగా ఈ ప్రసంగం పిల్లలను ఉత్తేజపరినందుకూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమ సందర్భంగా 'దరిశి చెంచయ్య - ఆయన జీవితమే ఒక సందేశం' పుస్తకాన్ని వేదిక మీదున్న పెద్దలు పునరావిష్కరించారు. అయికా బాలాజీ విరచిత సినిమా వ్యాసాల పుస్తకం 'సినీ ప్రపంచంలో ఆమె' గురించి బోడ తారకేశు సభకు పరిచయం చేయగా, ఆ పుస్తకాన్ని ఒట్టి భూతేశు ఆవిష్కరిం చారు. 'అన్నదమ్ముల వలెను జాతులు, మతములన్నియు మెలగవలెనోయ్' అన్న సందేశంతో ఈ సభ ముగిసింది.

**- అయికా బాలాజీ (కోల్‌కతా)**

# ఉషా కిరణాల వేళ... 'బరకత్' రహస్యం




- షేక్ రేష్మా

**నేటి యాంత్రిక ప్రపంచంలో కళ్లు తెరవకముందే అలారాల మోతలు, స్మార్ట్‌ఫోన్ల నోటిఫికేషన్లు, నిన్నటి నిలవ గుర్తులు మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. మంచం దిగకముందే గుండెపై ఏదో తెలియని బరువు, మనసులో ఆందోళన. పరుగుల లయతో మొదలయ్యే ఉదయం.. మధ్యాహ్నానికి సత్తువనంతా హరించి వేస్తుంది. 'ఇంత సంపాదిస్తున్నా జీవితంలో ఆ తృప్తి ఏది? కాలమంతా కరిగిపోతోంది కానీ ఆయుష్షులో ఆనందం ఏది?' అని ప్రతి గుండె నెమరేసుకునే ప్రశ్న ఇది.**

## నిద్ర ఒక లఘు మరణం.. మేల్కొనడం ఒక వరం!

అసలు నిద్ర అంటే ఏమిటి? కేవలం శరీరానికి విశ్రాంతి ఇవ్వడమేనా? కాదు. ఆధ్యాత్మిక కోణంలో నిద్ర ఒక 'లఘు మరణం'. మనం గాఢనిద్రలో ఉన్నప్పుడు ఆత్మ తాత్కాలికంగా శరీరాన్ని వీడి ఆధ్యాత్మిక ప్రయాణం చేస్తుంది. పవిత్ర ఖురాన్‌లోని 'సూరా అజ్-జుమర్' పేర్కొన్నట్టు- అల్లాహ్ నిద్రలో ఆత్మలను తన ఆధీనంలోకి తీసుకుంటాడు. ఎవరి ఆయుష్షు తీరిపోయిందో వారిని అక్కడే ఉంచేసుకుంటాడు, ఎవరికి ఇంకా సమయం ఉందో వారి ఆత్మలను తిరిగి భూమికి పంపుతాడు.

అంటే, ప్రతి ఉదయం మనం కళ్లు తెరుస్తున్నామంటే.. అది మన హక్కు కాదు, సృష్టికర్త మనకు ప్రసాదించిన సరికొత్త జీవితం! పశ్చాత్తాపపడటానికి, మంచి పనులు చేయడానికి ఆయన ఇచ్చిన మరో సువర్ణావకాశం. ఈ సత్యాన్ని గ్రహించిన రోజే ఉదయం అనేది ఒక భారంగా కాక, ఒక వరంగా కనిపిస్తుంది.

## తెరవెనుక సమరం.. మూడు ముడుల రహస్యం

మనం నిద్ర లేచే తరుణంలో ఒక అదృశ్య ఆధ్యాత్మిక యుద్ధం జరుగుతుందని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) హెచ్చరించారు. మనిషి నిద్రిస్తున్నప్పుడు షైతాన్ అతని తల వెనుక భాగంలో మూడు ముడులు వేస్తాడు. 'రాత్రి ఇంకా చాలా ఉంది, హాయిగా పడుకో' అని బద్ధకాన్ని నూరిపోస్తాడు. ఉదయం వేళ మంచం మనల్ని అయస్కాంతంలా లాగడానికి కారణం ఇదే. ఈ బద్ధకాన్ని జయించి, ఆ మూడు ముడులను విప్పడమే 'బరకత్' సాధన.

## రోజంతటినీ మార్చే నాలుగు సూత్రాలు

### 1. దైవస్మరణతో మొదటి ముడి విప్పండి:

ఉదయపు తొలి నిమిషంలో పాటించాల్సిన బంగారు సూత్రం- సృష్టి మనతో మాట్లాడకముందే, మనం సృష్టికర్తతో మాట్లాడాలి. కళ్లు తెరవగానే ఫోన్ చేతిలోకి తీసుకుంటే.. లోకంలోని వార్తలు, ఆందోళనలు, ఇతరుల ఆడంబర జీవితాల పోలికలు మన మనసును కలుషితం చేస్తాయి.

అందుకు భిన్నంగా, మంచం మీద ఉండగానే శ్వాసను గమనిస్తూ, ఆయుష్షును తిరిగిచ్చినందుకు కృతజ్ఞతగా ప్రవక్త నేర్పిన ఈ దుఆ (ప్రార్థన) చదవాలి:

"మాకు మరణాన్ని ప్రసాదించిన తర్వాత తిరిగి జీవితాన్నిచ్చిన ఆ అల్లాహ్‌కే సర్వస్తోత్రాలు.. మరియు పునరుత్థానం ఆయన వైపునకే ఉంది."

ఈ కృతజ్ఞతా భావంతో నాలుక కదలగానే, షైతాను వేసిన మొదటి ముడి వెంటనే విడిపోతుంది. "నన్ను స్మరించండి, నేను మిమ్మల్ని స్మరిస్తాను" అన్న దైవ వాక్యం మనకు రక్షణగా నిలుస్తుంది.

### 2. సంకల్పాన్ని శుద్ధి చేసుకోండి (నియ్యత్):

మంచం దిగడానికి ముందు కేవలం ఐదు సెకన్లు మనసును నిలపండి. "ఓ అల్లాహ్! ఈ రోజును నీ కోసమే జీవిస్తాను. నీ సృష్టి పట్ల కరుణతో ఉంటాను. నీవు నిషేధించిన చెడు పనులకు దూరంగా ఉంటాను" అని మనస్ఫూర్తిగా సంకల్పించుకోండి.

ఈ చిన్న సంకల్పం మీ లౌకిక పనులను అలౌకిక ఆరాధనలుగా మార్చేస్తుంది. కేవలం డబ్బు కోసమే కాకుండా, 'ఆహారాన్ని ఇచ్చే ఆ దాత' కోసం మీరు పని చేస్తున్నారనే భావన కలుగుతుంది. అప్పుడు మీరు ఆఫీసుకు వెళ్లడం, కుటుంబం కోసం వస్తువులు కొనడం, తోటివారితో నవ్వడం.. ప్రతిదీ పుణ్యకార్యంగా (సదఖా) మారిపోతుంది. ఫలితాల గురించిన ఆందోళన తొలగి మనసు ప్రశాంతంగా మారుతుంది.

### 3. వుజూతో (పవిత్రత) రెండో ముడిని ఛేదించండి:

కళ్లు తెరిచాక సోఫాలోనో, వంటగదిలోనో కాలక్షేపం చేయకుండా నేరుగా నీటి వద్దకు వెళ్లి 'వుజూ' (కాళ్లు, చేతులు, ముఖం కడుక్కునే పవిత్ర ప్రక్రియ) చేసుకోవాలి.

నీటికి శారీరక, ఆధ్యాత్మిక మాలిన్యాలను కడిగేసే శక్తి ఉంది. చల్లని నీరు ముఖాన్ని తాకగానే నరాలు ఉత్తేజితమై, నిద్రమత్తు వదిలిపోతుంది. ఆధ్యాత్మికంగా ఇది రాత్రి వేళ పాపాలను కడిగేసి, షైతాను ప్రభావం నుండి విముక్తిని ఇస్తుంది. దీనితో రెండో ముడి కూడా తెగిపోతుంది. పవిత్రంగా ఉన్న వ్యక్తి వద్దకు మలాయికలు (దైవదూతలు) చేరుకుంటారు, కీడు దూరమవు తుంది. ఆ పవిత్రత వల్ల ముఖంలో ఒక తెలియని తేజస్సు (నూర్) కనిపిస్తుంది.

### 4. 'ఫజర్' నమాజ్‌తో మూడో ముడిని అగ్నికి ఆహుతి చేయండి:

ఉదయపు అఖండ విజయానికి చివరి మెట్టు.. ప్రార్థనా చాప (ముసల్లా) పై నిలబడటం. కిబ్లా వైపు తిరిగి, చేతులెత్తి 'అల్లాహు అక్బర్' అనగానే షైతాను వేసిన ఆఖరి ముడి కూడా ముక్కలై పోతుంది.

లోకమంతా గాఢనిద్రలో ఉన్నప్పుడు మీరు మేల్కొని ప్రార్థించడం అంటే.. బద్ధకంపై, షైతానుపై విజయం సాధించడమే. ఫజర్ నమాజ్ చదివిన వ్యక్తి ఆ రోజంతా అల్లాహ్ ప్రత్యేక రక్షణ ఛత్రం కిందికి వస్తాడని ప్రవక్త సెలవిచ్చారు. ఉదయపు వేళ చేసే ప్రార్థనలకు దైవదూతలు స్వయంగా సాక్షులుగా ఉంటారని ఖురాన్ పేర్కొంది.

### ఒక చిన్న అడుగు.. ఒక గొప్ప మార్పు!

మొదటి నిమిషాన్ని దైవస్మరణతో గెలిస్తే.. ఉదయం మనదవు తుంది. ఉదయం మనదైతే.. రోజంతా మన అధీనంలోకి వస్తుంది. లోకమంతా బద్ధకంతో, భారమైన గుండెతో అడుగులు వేస్తుంటే.. ఈ 'బరకత్' రహస్యాన్ని పాటించే విశ్వాసి మాత్రం ఆధ్యాత్మిక రెక్కలతో ఉల్లాసంగా, తేలికగా లోకంలోకి అడుగుపెడతాడు.

రేపటి ఉదయం నుండి మీ అలారమ్ శబ్దాన్ని ఒక విసుగులా కాకుండా, సృష్టికర్త నుండి వచ్చిన ఒక ఆత్మీయ ఆహ్వానంగా భావించండి. ఆ ఒక్క నిమిషం దైవానికి ఇవ్వండి.. మీ జీవితాన్ని ఆయన 'బరకత్'తో నింపేస్తాడు!


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com




**ఉదయం కళ్ళు తెరవడమే ఆలస్యం... పక్కనే ఉన్న స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ వెలుగుతుంది. ఒక చిన్న నోటిఫికేషన్ టోన్. ఇంకేముంది, చేతి వేళ్లు అప్రయత్నంగా ఆ బటన్‌ను నొక్కుతాయి. అక్కడ మొదలైన ప్రయాణం, ఒక రీల్ నుంచి ఇంకో రీల్, ఒక వీడియో నుంచి ఇంకో వీడియో... గంటలు ఎలా గడిచిపోయాయో కూడా తెలియదు. ఒకప్పుడు మనిషికి ఆకలి వేస్తే అన్నం తినేవాడు, దాహమేస్తే నీళ్లు తాగేవాడు. కానీ ఇప్పుడు? మనసుకు ఎప్పుడు 'బోర్' కొట్టినా సోషల్ మీడియా అల్గారిథమ్స్ సిద్ధంగా ఉన్నాయి- మన బలహీనతలను, మన ఇష్టాలను ముందే పసిగట్టి, మనకు కావాల్సిన 'క్షణికానందాన్ని' ప్లేట్లలో పెట్టి వడ్డించడానికి!**

మనం జీవిస్తున్న ఈ డిజిటల్ యుగం మన సంకల్ప శక్తిని చాలా నిశ్శబ్దంగా నమిలేస్తోంది. ఏ క్షణానికి ఆ క్షణం తృప్తిని కోరుకునే ఈ 'ఇన్‌స్టంట్' ప్రపంచంలో, మనం మన కోరికలకే బందీలమైపోతున్నామా? అడుగడుగునా ఎదురయ్యే ఈ ప్రలోభాలను, జీవితంలో ఎదురయ్యే కష్టాలను జయించడమెలా? వేల సంవత్సరాల ఆధ్యాత్మిక మనస్తత్వశాస్త్రం మనకు అందిస్తున్న అద్భుతమైన జీవన సూత్రాలపై ప్రత్యేక కథనం...

## ఆ క్షణంలోనే ఉంది అసలు రహస్యం!

ఆధ్యాత్మిక శాస్త్రంలో ఒక గొప్ప మాట ఉంది-జీవితంలో ఏదైనా పరీక్ష ఎదురైనప్పుడు, అది హఠాత్తుగా వచ్చిన కష్టమైనా లేదా ముంచెత్తే కోరికైనా, దానిని ఎదుర్కొనే కీలకమైన మలుపు ఆ సంఘటన ప్రారంభమయ్యే మొదటి క్షణంలోనే ఉంటుంది. దీనినే 'ఫస్ట్ స్ట్రైక్' అంటారు.

మనకు ఏదైనా పెద్ద కష్టం వచ్చినప్పుడు, ఆ మొదటి షాక్‌లోనే మన అంతరంగం ఎలాంటిదో బయటపడుతుంది. జీవితం మనల్ని అకస్మాత్తుగా దెబ్బతీసినప్పుడు, లోపల నిరంతర

దైవచింతన, ఓర్పు ఉన్న మనస్సు 'ఇదంతా తాత్కాలికం' అని సర్దుకుంటుంది. అదే మనస్సును ఉన్నతమైన ఎదుగుదలకు వాడుకుంటుంది.

కోరికల నిగ్రహం కూడా ఇంతే! ఒక తప్పుడు పని చేయాలనో, ఒక అనవసరమైన ప్రలోభానికి లొంగిపోవాలనో అనిపించినప్పుడు... ఆ ఆలోచన వచ్చిన మొదటి క్షణంలోనే, అంటే ఆ 'మొదటి ముద్ద' తినడానికి ముందే, లేదా కోపంలో 'మొదటి మాట' టైప్ చేయడానికి ముందే మనల్ని మనం ఆపగలిగితే... అంతకంటే పెద్ద విజయం మరొకటి లేదు. ఆ ఒక్క క్షణం నిగ్రహం, మనల్ని అదుపు తప్పే దావాగ్ని నుంచి కాపాడుతుంది.

## 'సౌకర్యం' తెచ్చే నిశ్శబ్ద ప్రమాదం

మనం సాధారణంగా ఏమనుకుంటామంటే- కష్టాలు, పేదరికం, బాధలు ఉన్నప్పుడే మనిషికి పరీక్షలు ఎదురవుతాయని. కానీ పెద్దలు ఏమంటారంటే, అన్నిటికంటే ప్రమాదకరమైన పరీక్ష 'సమృద్ధి మరియు సౌకర్యాలతో కూడిన పరీక్ష'.

ప్రపంచం చాలా కఠినంగా, ఇబ్బందులతో ఉన్నప్పుడు మనిషి సహజంగానే దైవం వైపు చూస్తాడు. ఓర్పుగా ఉంటాడు. కానీ, జీవితంలో ఎటుచూసినా సౌకర్యాలు, చేతి నిండా డబ్బు, అడగకముందే అన్నీ వచ్చే విలాసవంతమైన వాతావరణం ఉన్నప్పుడు... అవసరం లేకపోయినా కేవలం మన నమ్మకం కోసం, విలువల కోసం మనల్ని మనం అదుపులో ఉంచుకోవడం చాలా కష్టం. లగ్జరీ అనేది మనిషి ఆత్మను నిశ్శబ్దంగా ఆధ్యాత్మిక నిద్రలోకి జారుకునేలా చేస్తుంది. ఈ భ్రమను దాటడమే నిజమైన యోగం.

## ఖురాన్ చూపిన 'ఉపవాస' మార్గం

ఈ తక్షణ తృప్తి (Instant Gratification) అనే రోగానికి, మన నిగ్రహ శక్తిని పెంచడానికి పవిత్ర ఖురాన్ ఒక అద్భుతమైన ఆచరణాత్మక మార్గాన్ని సూచిస్తోంది. అదే-సహనం, ప్రార్థన. ఇక్కడ సహనం అంటే ఆచరణలో 'ఉపవాసం' అని అర్థం.

ఉపవాసం అనేది కేవలం ఆకలితో అలమటించడం కాదు. అది క్షణికానందాన్ని వాయిదా వేసే ఒక గొప్ప మానసిక శిక్షణ. కళ్ళముందు ఆహారం ఉన్నా, దాహమేస్తున్నా... దైవాజ్ఞ కోసం ఉద్దేశపూర్వకంగా "వద్దు, ఇప్పుడు కాదు" అని మనసుకు చెప్పడం ద్వారా, నిజ జీవితంలో హానికరమైన కోరికలు ఎదురైనప్పుడు కూడా అంతే దృఢంగా "లేదు" అని తిరస్కరించే అంతర్గత బలాన్ని ఆత్మ పెంపొందించుకుంటుంది.

## తాత్కాలిక త్యాగం... శాశ్వత సంబరం!

ఈ ఆధ్యాత్మిక క్రమశిక్షణకు ఒకే ఒక సరళమైన లెక్క ఉంది: "రేపు పరలోకంలో వచ్చే శాశ్వత ఆనందం కోసం, ఇవాళ కళ్ళముందున్న తాత్కాలిక ప్రలోభాన్ని వదులుకోవడం."

ఈ లోకంలో నిజాయితీగా, నీతిగా బతకడం అంటే ఎవరికీ తెలియకుండా అంతర్గతంగా ఒక పెద్ద యుద్ధం చేయడమే. నిజమైన నమ్మకస్థులు తాము చేసే మంచి పనులను కూడా దాచి ఉంచుతారు. లోకం మెచ్చుకోవాలనో, లైకులు కొట్టాలనో ఆశపడరు. తమ సంతోషాన్ని, తృప్తిని భవిష్యత్తు కోసం దాచుకుంటారు.

కానీ, అంతిమ తీర్పు రోజున (Day of Judgment) దీనికి పూర్తి భిన్నంగా జరుగుతుంది. ఈ లోకంలో చీకటిలో, ఎవరికీ తెలియకుండా నిగ్రహాన్ని పాటించి, మంచి పనులు చేసిన వారికి వారి 'కర్మల పత్రాలు' కుడి చేతికి ఇస్తూ బహిరంగంగా సత్కరిస్తారు. అప్పుడు ఆ ఆనందంలో ఆ వ్యక్తి, తన మంచి పనులను దాచుకోకుండా, అమితమైన గర్వంతో, సంతోషంతో మానవాళి అంతా ఉన్న సభలో పరుగెడుతూ... "అందరూ ఇటు చూడండి! నా కర్మల పత్రాన్ని చదవండి!" అని కేకలు వేస్తాడు.

ఇవాళ మనం రహస్యంగా పాటించే క్రమశిక్షణే, రేపు విశ్వమంతటా జరుపుకునే బహిరంగ వేడుకగా మారుతుంది. తాత్కాలిక ప్రపంచంలో మనం తీసుకునే కఠినమైన నిర్ణయాలే శాశ్వతమైన పరలోకంలో అత్యున్నత విజయాలను అందిస్తాయని చెప్పడానికి ఇంతకంటే హృద్యమైన నిదర్శనం ఏముంటుంది? ✤

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




## ప్రముఖ ఇస్లామిక్ పండితులు మౌలానా సల్మాన్ హుసైని నద్వీ కన్నుమూత

ప్రముఖ ఇస్లామిక్ విద్వాంసుడు, దారుల్ ఉలూమ్ నద్వతుల్ ఉలమా మాజీ డీన్ మౌలానా సల్మాన్ హుసైని నద్వీ (72) అనారోగ్యంతో /జూ లక్నోలో కన్నుమూశారు. 1954లో జన్మించిన ఆయన, సౌదీ అరేబియాలో ఉన్నత విద్యను అభ్యసించి, స్వదేశానికి తిరిగి వచ్చాక విద్యా బోధనలోనూ, అనేక విద్యా వైద్య సంస్థల స్థాపనలోనూ కీలక పాత్ర పోషించారు. ఇస్లామిక్ సాహిత్యంపై ఎన్నో గ్రంథాలను రచించిన ఆయన, సామాజిక సంస్కరణల పట్ల నిబద్ధతతో ఉండేవారు. వేలాదిమంది విద్యార్థులకు మార్గదర్శిగా నిలిచిన ఆయన మృతి, విద్యా, మతపరమైన వర్గాలకు తీరని లోటు. సోమవారం సాయంత్రం లక్నోలోని కతౌలీలో జరిగిన ఆయన అంత్యక్రియలకు భారీగా తరలివచ్చిన అభిమానులు, ప్రముఖులు అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. ప్రముఖ ఇస్లామిక్ పండితులు, విద్యావేత్త మౌలానా సయ్యద్ సల్మాన్ హుసైని నద్వీ మరణం పట్ల జమాత్-ఎ-ఇస్లామీ హింద్ (JIH) జాతీయ అధ్యక్షుడు సయ్యద్ సాదతుల్లా హుసైని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం ముస్లిం సమాజానికి తీరని లోటని పేర్కొంటూ, విద్య, పరిశోధన, దావత్, విద్యా సంస్థల స్థాపన ద్వారా మౌలానా చేసిన బహుముఖ సేవలను కొనియాడారు. భారతీయ ఇస్లామిక్ మేధోరంగంలో ఆయన అందించిన అపారమైన కృషి చిరస్మరణీయమని, ఆయన మృతితో ఒక గొప్ప మార్గదర్శిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. మౌలానా కుటుంబ సభ్యులకు, విద్యార్థులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, అల్లాహ్ ఆయన సేవలను స్వీకరించి జన్నతుల్ ఫిర్దౌస్‌లో ఉన్నత స్థానాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.

## హైదరాబాద్‌లో వేతనాలు ఎక్కువ.. నిరుద్యోగం అంతకంటే ఎక్కువ!

నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (NSO) విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, మిలియన్ కంటే ఎక్కువ జనాభా కలిగిన 46 ప్రధాన భారతీయ నగరాల్లో హైదరాబాద్ ఆర్థిక పనితీరు మిశ్రమంగా ఉంది. ఒకవైపు నగరం అత్యధిక వేతనాలు, ఉత్పాదకతను కలిగి ఉండి దేశంలోని బలమైన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా నిలుస్తున్నప్పటికీ, నిరుద్యోగితా రేటు మాత్రం సగటు కంటే ఎక్కువగా 6.8 శాతంగా నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా మహిళా నిరుద్యోగితా రేటు 9.1 శాతంగా ఉండటం మరియు 15 నుండి 29 ఏళ్ల మధ్య వయస్సు గల యువతలో 25.1 శాతం మంది ఎటువంటి ఉపాధి, విద్య లేదా శిక్షణ లేకుండా (NEET) ఉండటం గమనార్హం. రెగ్యులర్ వేతన జీవుల సగటు నెలవారీ ఆదాయం రూ. 31,153గా ఉండటం, కార్మికుల ఉత్పాదకత (GVA) రూ. 2,76,700తో దేశంలోనే రెండో స్థానంలో నిలవడం నగరంలోని ఉపాధి మార్కెట్ బలాన్ని సూచిస్తున్నప్పటికీ, పెరుగుతున్న నిరుద్యోగితా సమస్యను అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.


## హజ్ యాత్రకు దరఖాస్తుల ప్రక్రియ షురూ: పోర్టల్, యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు

హజ్ యాత్రకు వెళ్లాలనుకునే దాసుల కోసం కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 'హజ్ పాలసీ 2027'ను అధికారికంగా ప్రకటించింది. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఈ విధానాన్ని ఆవిష్కరించి, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు. ఈసారి యాత్రికులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా హజ్ కమిటీ ఆఫ్ ఇండియా పోర్టల్‌తో పాటు 'హజ్ సువిధ యాప్' ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులను అందుబాటులోకి తెచ్చారు. హజ్ కమిటీకి 1,22,518, ప్రైవేట్ టూర్ ఆపరేటర్లకు 52,507 సీట్ల చొప్పున 70:30 నిష్పత్తిలోనే కోటా కొనసాగనుంది. గత ఏడాది హజ్ యాత్రలో మంచి స్పందన పొందిన 20 రోజుల 'షార్ట్ హజ్ ప్యాకేజీ'ని ఈసారి కూడా కొనసాగిస్తూనే, యాత్రికుల డిమాండ్ మేరకు కొత్తగా కోల్‌కతాను ఎంబార్కేషన్ పాయింట్‌గా చేర్చారు.

ముఖ్యంగా, మెరుగైన సేవల కోసం ప్రతి 135 మంది యాత్రికులకు ఒక హజ్ ఇన్‌స్పెక్టర్‌ను కేటాయిస్తూ నిబంధనలను సడలించగా, 2026 నాటి వెయిటింగ్ లిస్టులో ఉన్న టాప్ 20 శాతం మందికి ఈసారి ప్రాధాన్యత కల్పించనున్నారు. యాత్రికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం, సౌదీ వైద్య మార్గదర్శకాలకు అనుగుణంగా కఠినమైన స్క్రీనింగ్ నిర్వహించనుంది. భవిష్యత్తులో హజ్ నిర్వహణను మరింత పారదర్శకంగా మార్చేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సాంకేతికతను తీసుకురాబోతున్నట్లు మంత్రి వెల్లడించారు. హిందీ, ఉర్దూ, ప్రధాన ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉండే ఈ మల్టీలింగ్వల్ AI ప్లాట్‌ఫామ్ ద్వారా దరఖాస్తు, విమాన ప్రయాణం, వసతి, ఫిర్యాదుల నమోదు వంటి అంశాల్లో యాత్రికులకు 24/7 సహాయం అందనుంది. నిర్ణీత గడువులోపు అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకోవాలని, యాత్రికులకు సురక్షితమైన, గౌరవప్రదమైన అనుభవాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు.




## 2040 నాటికి మృత్యుఘంటికగా కిడ్నీ వ్యాధులు



ప్రపంచవ్యాప్తంగా దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి (CKD) నిశ్శబ్దంగా మహమ్మారిలా విస్తరిస్తోంది. 'ది లాన్సెట్' తాజా అధ్యయనం ప్రకారం, ప్రస్తుతం దాదాపు 80 కోట్ల మందికి పైగా ప్రజలు ఈ వ్యాధి బారిన పడి ఉన్నారని, ఇదే వేగంతో వ్యాధి విస్తరిస్తే 2040 నాటికి ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణమయ్యే ఐదు ప్రధాన వ్యాధుల్లో కిడ్నీ వ్యాధి ఒకటిగా మారుతుందని పరిశోధకులు తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ప్రారంభ దశలో ఎటువంటి లక్షణాలు కనిపించకపోవ డం, వ్యాధి తీవ్రరూపం దాల్చిన తర్వాతే బయటపడటం ప్రధాన సమస్యగా మారింది. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, అనారోగ్యకరమైన జీవనశైలి కారణంగా కిడ్నీలపై భారం పడుతోంది. అయితే, ఆధునిక వైద్యశాస్త్రంలో అందుబాటులోకి వచ్చిన కొత్త రకం మందులు, కృత్రిమ మేధ (AI) ఆధారిత స్క్రీనింగ్ పద్ధతులు ఈ వ్యాధిని ముందస్తుగా గుర్తించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని నిపుణులు పేర్కొం టున్నారు. పురుషులు, మహిళల మధ్య శారీరక నిర్మాణంలో ఉండే తేడాలను పరిగణనలోకి తీసుకుని, రోగి అవసరాలకు అనుగుణంగా 'పర్సనలైజ్డ్ ట్రీట్‌మెంట్' అందించడం ద్వారా మాత్రమే ఈ ముప్పును అరికట్టవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఆహారంలో ప్రోటీన్, ఉప్పు పరిమాణాన్ని తగ్గించుకోవడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం వంటి జాగ్రత్తలు పాటించడమే ప్రాణాపాయం నుండి కాపాడుకునే ఏకైక మార్గమని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## పాలస్తీనా చిన్నారుల మరణాలపై ఐరాస తీవ్ర హెచ్చరిక

పాలస్తీనా పిల్లలపై జరుగుతున్న అమానుష దాడులపై ఐక్యరాజ్య సమితి ఏర్పాటు చేసిన స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కమిషన్ విడుదల చేసిన 100 పేజీల నివేదిక దిగ్భ్రాంతికరమైన వాస్తవాలను వెల్లడించింది. అక్టోబర్ 2023 నుండి మార్చి 2026 మధ్య కాలంలో ఇస్రాయిల్ భద్రతా దళాలు పాలస్తీనా పిల్లలను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుని, జాతి నిర్మూలనకు పాల్పడ్డాయని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఈ కాలంలో 20,000 మందికి పైగా చిన్నారులు మరణించగా, వేలాది మంది అనాథల య్యారని, పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు వ్యవస్థాగతంగా ధ్వంసమయ్యాయని కమిషన్ పేర్కొంది. వైమానిక దాడులతో పాటు స్నైపర్ల ద్వారా పిల్లలను లక్ష్యంగా చేసుకోవడం, ఆకలిని యుద్ధ ఆయుధంగా ఉపయోగించడం, కీలక మౌలిక సదుపాయాలను నాశనం చేయడం వంటివి పాలస్తీనా భవిష్యత్ తరాలను నిర్మూలించే వ్యూహాత్మక ప్రయత్నమని నివేదిక అభివర్ణించింది. అంతర్జాతీయ చట్టాలను తీవ్రంగా ఉల్లంఘిస్తూ సాగుతున్న ఈ అకృత్యాలపై తక్షణమే అంతర్జాతీయ సమాజం స్పందించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కమిషన్ గంభీరంగా హెచ్చరించింది.

## అమెరికాలో పుట్టిన వారందరూ అమెరికన్లే..

అమెరికాలో జన్మించిన పిల్లలకు లభించే జన్మతః పౌరసత్వాన్ని పరిమితం చేస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసింది. తల్లిదండ్రుల వలస స్థితితో సంబంధం లేకుండా అమెరికా గడ్డపై జన్మించిన పిల్లలందరికీ పౌరసత్వం కల్పించే 14వ రాజ్యాంగ సవరణను కోర్టు ఈ సందర్భంగా సమర్థించింది. ట్రంప్ నిర్ణయం వల్ల ఏటా లక్షలాది మంది శిశువుల పౌరసత్వంపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున, 6-3 తీర్పుతో సుప్రీంకోర్టు ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకుంది.

## యూరప్‌ను వణికిస్తున్న రికార్డు స్థాయి వడగాల్పులు

యూరప్ ఖండం రికార్డు స్థాయి వడగాల్పులతో అల్లాడి పోతోంది. సగటు ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత పది రోజుల్లోనే ఎండల తీవ్రతకు యూరప్ వ్యాప్తంగా 1,300 మందికి పైగా మరణించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది. ముఖ్యంగా ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ దేశాల్లో ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరాయి. ఎండల ధాటికి సాధారణ జనజీవనం స్తంభించడమే కాకుండా, వడదెబ్బ బాధితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. శీతల వాతావరణానికి అలవాటుపడిన యూరప్ దేశాల్లోని నిర్మాణాలు, పెరుగుతున్న ఎండలను తట్టుకోలేకపోతుండటంతో ప్రాణ నష్టం అధికంగా సంభవిస్తోంది.

# క్షమా గుణం:

## మానవత్వానికి మకుటాయమానమైన అలంకారం

ముహమ్మద్ వహీదుద్దీన్

**క్షమాగుణం** మనిషిని ఉదాత్తునిగా నిలబెట్టే దివ్య గుణం. కష్టకాలంలో ప్రతీకారం తీర్చుకోవడం సాధారణ ప్రవృత్తి కావచ్చు, కానీ క్షమించడం అసాధారణమైన వ్యక్తిత్వ సంపత్తి. క్షమాశీలి హృదయం సముద్రమంత విశాలమైనది. ఇస్లాం మతం ప్రేమ, దయ, కరుణ, క్షమ అనే నాలుగు ప్రధాన స్తంభాలపై నిర్మితమైంది. పవిత్ర ఖుర్ఆన్ మరియు హదీసులు విశ్వాసులను నిరంతరం క్షమా గుణాన్ని అలవర్చుకోవాలని ఉద్బోధిస్తున్నాయి. అల్లాహ్ స్వయంగా 'అల్-గఫూర్' (అత్యంత క్షమాశీలుడు), 'అర్-రహీమ్' (అపార కరుణామయుడు). కాబట్టి, ఆయనను విశ్వసించే ప్రతి ముస్లిం క్షమాగుణాన్ని తన జీవితంలో అంతర్భాగం చేసుకోవడం అత్యంత ఆవశ్యకం.

### క్షమాగుణం అంటే ఏమిటి?

క్షమాగుణం అనగా మనకు అపకారం చేసిన వారిపై ద్వేషాన్ని పెంచుకోకుండా, ప్రతీకారేచ్ఛను త్యజించి, అల్లాహ్ కోసం వారిని క్షమించడం. ఇది బలహీనతకు నిదర్శనం కాదు, ఇది నిజమైన ధైర్యం. కోపాన్ని జయించి ఎదుటివారిని క్షమించడం వల్ల హృదయం ప్రశాంతతను పొందుతుంది, సమాజంలో సౌభ్రాతృత్వం వర్ధిల్లుతుంది.

### దివ్య ఖుర్ఆన్ బోధన

పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "వారు కోపాన్ని అణచుకుంటారు; ప్రజలను క్షమిస్తారు. అల్లాహ్ సత్కార్యాలు చేసే వారిని ప్రేమిస్తాడు." (సూరహ్ ఆలి ఇమ్రాన్ 3:134)

ఈ ఆయత్ కోపాన్ని నిగ్రహించడం, ఇతరులను క్షమించడం ఒక సద్విశ్వాసి (ముమిన్) గొప్ప లక్షణాలని స్పష్టం చేస్తోంది. మరోచోట అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు:

"క్షమించు, మంచిని ఉపదేశించు, అజ్ఞానులను పట్టించుకోకు." (సూరహ్ అల్-అరాఫ్ 7:199)

### క్షమించే వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు

ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా అభయమిస్తున్నాడు: "మీరు క్షమించి, తప్పులను మన్నించి, ఉపేక్షిస్తే నిశ్చయంగా అల్లాహ్ అత్యంత క్షమాశీలుడు, అపార కరుణామయుడు." (అత్ తఘాబున్ 64:14)

మనం అల్లాహ్ క్షమాభిక్షను కోరుకునే వారమైతే, మనం కూడా ఇతరుల తప్పులను క్షమించాల్సిన బాధ్యత ఉంది. మనం ఇతరులకు చూపిన కరుణనే అల్లాహ్ మనపై కురిపిస్తాడు.

### ప్రవక్త ముహమ్మద్ (స) జీవితంలో క్షమాగుణం

ప్రవక్త ముహమ్మద్ (స) జీవితం క్షమాగుణానికి నిలువెత్తు నిదర్శనం. ఆయనను అవమానించిన వారిని, శారీరకంగా హింసించిన వారిని కూడా ఆయన క్షమించి, వారి పట్ల దయ చూపారు. మక్కా విజయ దినాన, దశాబ్దాల పాటు తనను వేధించిన ఖురైష్ ప్రజల ముందు ఆయన పలికిన మాటలు ప్రపంచ చరిత్రలో అద్వితీయమైనవి: "ఈ రోజు మీపై ఎటువంటి నింద లేదు. మీరు స్వేచ్ఛాజీవులు, వెళ్ళండి!"

### హదీసుల వెలుగులో క్షమ

దైవప్రవక్త(స) ఇలా ప్రబోధించారు: "దయ చూపేవారిపై పరమ కరుణామయుడు (అల్లాహ్) దయ చూపుతాడు."

"బలవంతుడంటే కుస్తీలో గెలిచేవాడు కాదు; కోపం వచ్చినప్పుడు తనను తాను నిగ్రహించుకునేవాడే నిజమైన బలవంతుడు."

### క్షమాగుణం వల్ల కలిగే ప్రయోజనాలు

- అల్లాహ్ ప్రీతి మరియు సామీప్యం లభిస్తుంది.
- హృదయానికి అపారమైన ప్రశాంతత చేకూరుతుంది.
- కుటుంబాల్లో ఐక్యత, సమాజంలో శాంతి నెలకొంటుంది.
- శత్రుత్వాలు వీడి స్నేహబంధాలు బలపడతాయి.
- మన పాపాలను అల్లాహ్ క్షమిస్తాడన్న ధీమా పెరుగుతుంది.

### ఒక స్ఫూర్తిదాయక సంఘటన

ప్రవక్త(స) నడిచే మార్గంలో ప్రతిరోజూ చెత్త వేసే ఒక వ్యక్తి, ఒకరోజు అలా చేయలేదు. ఆ వ్యక్తి అనారోగ్యంతో ఉన్నారని గ్రహించిన ప్రవక్త (స), స్వయంగా అతని ఇంటికి వెళ్లి పరామర్శిం చారు. ప్రవక్త ప్రదర్శించిన ఆ అద్భుతమైన క్షమాగుణానికి చలించిన ఆ వ్యక్తి, సత్యమార్గాన్ని స్వీకరించారు. ఇది ద్వేషాన్ని ప్రేమతో జయించవచ్చని చాటిచెప్పే గొప్ప సందేశం.

### నేటి సమాజానికి సందేశం

నేడు చిన్న చిన్న విషయాలకే కోపతాపాలు, కుటుంబ కలహాలు పెరిగిపోతున్నాయి. క్షమించే మనస్తత్వం ఉంటే ఇటువంటి సమస్యలు మూలంలోనే అంతమైపోతాయి. మనం ఇతరుల తప్పులను మన్నిస్తే, అల్లాహ్ మన తప్పులను క్షమిస్తాడు.

### ముగింపు

క్షమాగుణం విశ్వాసి ధరించే అత్యంత విలువైన ఆభరణం. ప్రతీకారం కంటే క్షమ, ద్వేషం కంటే ప్రేమ, కోపం కంటే సహనం మిన్న. మన జీవితాల్లో ఖుర్ఆన్, ప్రవక్త (స) బోధనలను ఆచరణలో పెట్టి, శాంతియుత సమాజాన్ని నిర్మిద్దాం. అల్లాహ్ మనందరికీ క్షమించే హృదయాన్ని, కోపాన్ని జయించే శక్తిని, పరస్పరం ప్రేమతో జీవించే జ్ఞానాన్ని ప్రసాదించుగాక. ఆమీన్.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2026-2028 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**